తెలుగు దిన పత్రిక
http://aksharagalam.com

# అక్షరగళం
నిజం..నిర్భయంగా

హైదరాబాద్ | గురువారం | 08-01-2025 | సంపుటి-03 | సంచిక-214 | పేజీలు - 08 | వెల:3/–

## జైలులో మత్తు పదార్థాల సరఫరా

### నిజామాబాద్ జైలర్ ఉపేందర్ సస్పెన్షన్



**అక్షరగళం,నిజామాబాద్,జనవరి7:**
జిల్లా జైలులో గంజాయి దొరికిన ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. జైలులో డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలు సరఫరా అవుతుందన్న ఆరోపణలపై జైళ్ల శాఖ డీఐజీ, ఐజీ పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. ఈ విచారణ నివేదిక ఆధారంగా జైలర్ ఉపేందర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మరో జైలర్ సాయి సురేశ్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే సూపరింటెండెంట్ దశరథాన్ని నెల రోజులు సెలవులపై వెళ్లాలని ఆదేశించారు.ఇక వరంగల్ జైలర్‌గా పనిచేస్తున్న పూర్ణచందర్‌కు నిజామాబాద్ జైలర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆనంద్‌రావుకు ఇంచార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. జైలు అధికారులతో కలిసి పనిచేసినట్లు తేలిన ఖైదీలను ఇతర జైళ్లకు మార్చారు.




# ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు..!

### అధికారులను సన్నద్ధం చేసిన కమిషనర్
### కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
### ఓటర్ల జాబితాల సవరణ, అభ్యంతరాలపై షెడ్యూల్
### ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశం

**అక్షరగళం, హైదరాబాద్,జనవరి7:**
తెలంగాణలో ఇటీవలే గ్రామ పంచాయతీ ఎన్నికలు సమమర్థంగా నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. తాజాగా మున్సిపల్ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) కసరత్తు చేస్తోంది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, టైమ్‌లైన్స్‌పై కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. అందుకోసం బుధవారం జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధిరులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రాష్ట్ర వ్యాప్తంగా గతేడాది డిసెంబర్‌లో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవంతంగా నిర్వహించింది. తాజాగా.. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టింది. అందుకోసం జిల్లా, మున్సిపల్ మిగతా 2లో




## గిరిజన సంక్షేమానికి కృషి

### ఎప్పుడూ లేనంతగా నిధుల కేటయింపు
### రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన సీతక్క

**అక్షరగళం, ములుగు,జనవరి7:**
గిరిజనలు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, గతంలో ఎప్పుడూ లేని విధంగా రేవంత్ నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పాటుపడుతోందని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, స్థానిక డీడీ దబ్బకట్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఆదివాసీల ఆత్మగౌరవం, అస్తిత్వానికి ప్రతీకగా మేడారం జాతర రూపుదిద్దుకుంటుందని, జాతర పవిత్రతను కాపాడాలని మిగతా 2లో

## ప్రేమ పేరుతో మైనర్ బాలికపై అత్యాచారం

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**అక్షరగళం, విజయవాడ,జనవరి7:**
జిల్లాలోని చందర్లపాడు మండలం విపరింతలపాడులో ఒక మైనర్ బాలికపై అత్యాచారం జరిగింది. ప్రేమ పేరుతో అదే గ్రామానికి చెందిన జాషువా(21) అనే యువకుడు మిగతా 2లో




## మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని ఆదరించండి

### కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి

**అక్షరగళం, హైదరాబాద్,జనవరి7:**
బిజెపితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని, డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లనే రాష్ట్రం పురోగమనిస్తుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ ఉజ్వలంగా ఉందన్నారు. మిగతా 2లో



## 50 కోట్ల జిఎస్టీ పన్ను ఎగవేత

### ఆరెంజ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అరెస్ట్
### ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ఎంపి చేతన్ కూడా అరెస్ట్

**అక్షరగళం, హైదరాబాద్,జనవరి7:**
జీఎస్టీ పన్ను ఎగవేత కేసులపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ హైదరాబాద్ జోనల్ యూనిట్ దాడులను మరింత ముమ్మరం చేసింది. డేటా అనలిటిక్స్, అంతర 'ఏజెన్సీ సమన్వయంతో సేకరించిన ప్రత్యేక మిగతా 2లో

## కెసిఆర్ అప్పులు చేసింది నిజమే

### ఆ అప్పులు తెలంగాణ అభివృద్ధి కోసమే..
### సిఎం రేవంత్ ఫ్రస్టేషన్‌లో ఉన్నాడు
### కొత్త పల్లవి అందుకున్న బిఆర్ఎస్ నేత కెటిఆర్






**అక్షరగళం, ఖమ్మం,జనవరి7:**
తెలంగాణకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అద్భుతమైన ప్రాజెక్టులు తీసుకొచ్చారని కెటిఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అప్పు చేసిన మాట వాస్తవమేనని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయితే చేసిన అప్పు తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించారని వివరించారు. ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్టేషన్‌లో ఉన్నారని కెటిఆర్ అన్నారు. ఆయనలో అంత ఫ్రస్టేషన్ ఎందుకో తనకు అర్థం కావడం లేదని తెలిపారు. సెక్యూరిటీ వాళ్ళతో పాటు పోలీసుల్ని సైతం ఆయన కొడుతున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని.. అరుస్తున్నాడు.. కొడుతున్నాడు.. రేపు ఎవరినైనా కరుస్తాడేమో జాగ్రత్త' అంటూ సీఎం భార్య గీతకు ఈ సందర్భంగా కేటీఆర్ హితవు పలికారు. అధికార కాంగ్రెస్ పార్టీలోని అగ్రనేతలకు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలోని కీలక నేతల మధ్య మాటలు తూటాలు పేలుతున్న క్రమంలో కెటిఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల వేడి బాగా పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మిగతా 2లో




## సంక్రాంతి సందర్భంగా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

### అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్
### ప్రపంచ పర్యాటకంగా తెలంగాణ అభివృద్ధి
### అధికారులతో కలసి సమీక్షించిన మంత్రి జూపల్లి


**అక్షరగళం, హైదరాబాద్,జనవరి7:**
ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడిరచారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ మిగతా 2లో

## అమరావతిలో రెండో విడత భూ సమీకరణ

### వడ్డమానులో ప్రారంభించిన మంత్రి నారాయణ
### లక్షన్నర వరకు రుణమాఫీకి మంత్రి హామీ



**అక్షరగళం, అమరావతి,జనవరి7:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో రెండో విడత భూ సమీకరణ ప్రారంభమైంది. తుళ్లూరు మండలం వడ్డమానులో మంత్రి నారాయణ ఈ ప్రక్రియను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తుళ్లూరు, అమరావతి మండలాల్లోని ఏడు గ్రామాల రైతుల నుంచి ప్రభుత్వం సుమారు 16,666 ఎకరాలను సమీకరించనుంది. ఇందుకోసం ఈ రైతుల నుంచి అంగీకార పత్రాలను అధికారులు స్వీకరణ చేపట్టారు. ఈ ఏడు గ్రామాల రైతుల నుంచి స్వీకరించే భూమిని అంతర్జాతీయ క్రీడా పోటీల కోసం వినియోగిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇక్కడే ఒలంపిక్స్ నిర్వహణ కూడా జరుగుతుందని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం సేకరించిన భూమిని త్వరగా అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. మూడేళ్లలో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా ప్రాంగణం పూర్తిచేయాలని సీఎం చెప్పారన్నారు. రైతుల కౌలు పెంచేందుకు సీఎం ప్రాథమికంగా అంగీకరించారని మంత్రి చెప్పారు.ఈ నెల 6 వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ మిగతా 2లో



## ఐ బొమ్మ రవికి కోర్టులో చుక్కెదురు

### ఐదు కేసుల్లో బెయిల్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు

**అక్షరగళం, హైదరాబాద్,జనవరి7:**
పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అతడి బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే దేశం దాటి వెళ్లిపోయే అవకాశం మిగతా 2లో



# గిరిజన సంక్షేమానికి కృషి

(మొదటిపేజీ తరువాత)

మంత్రి సీతక్క సూచించారు. పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకుల సమన్వయంతో జాతర విజయవంతం చేయాలన్నారు. జాతర నిర్వహణపై ఆదివాసీ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసం మేడారం జాతర కలకలాం గుర్తుండిపోయేలా ఆలయ ప్రాంగణం రూపుదిద్దుకుంటుందని వెల్లడిరచారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకొచ్చేటప్పుడు ఆదివాసీ యువజన సంఘాలు సమన్వయం పాటించాలని, వలంటరీ సభ్యులకు, మహిళలకు ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. జాతర సమయంలో ఇసుక లారీల రవాణాను పూర్తిగా నిలిపివేయనున్నట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తులు ఏ విధంగా దర్శనం చేసుకోవాలనే అంశంపై ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించామని అన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా జాతరకు ఏర్పాట్లు చేస్తున్నామని, అభివృద్ధిక శ్రీకారం చుట్టామని అన్నారు.




# మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని ఆదరించండి

(మొదటిపేజీ తరువాత)

తెలంగాణలో కూడా భవిష్యత్ బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు. జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో భాజపాకు అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇటీవలి పంచాయితీ ఎన్నికల్లో పలుచోట్ల బిజెపి బలం చాటిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ బిజెపిని ఆశీర్వదించాలన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో నిర్మించనున్న సింథటిక్ ట్రాక్ స్థలాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ పరిశీలించారు. స్థల విషయమై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా జమ్మికుంట, హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.కోటి వ్యయంతో ఆధునిక పరికరాలను సమకూర్చానని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు చర్యలు తీసుకుంటామన్నారు. జమ్మికుంటలోని అంబేద్కర్ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ ముంపు ప్రాంతాలను కాపాడతానని, వరదకాలువ నిర్మాణాన్ని చేపడతామన్నారు.

# ప్రేమ పేరుతో మైనర్ బాలికపై అత్యాచారం

(మొదటిపేజీ తరువాత)

బాలికను మోసం చేశాడు. 14 ఏళ్ల మైనర్ బాలిక.. పక్క గ్రామంలో ప్రభుత్వ వసతీ గృహంలో ఉంటూ జడ్పీహెచ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. క్రిస్మస్ పండుగ సందర్భంగా సెలవులకు స్వగ్రామానికి వచ్చింది. అదే గ్రామంలో ఉంటున్న జాషువా అనే యువకుడు బాలికను ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. డిసెంబర్ 26న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో చూసి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ విషయం ఎవరికి చెప్పినా ఇద్దరు కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తా అని బెదిరించాడు. బాలిక అనారోగ్యంగా ఉండటంతో ఆమె తల్లి ఏం జరిగిందని ప్రశ్నించగా అసలు విషయం చెప్పింది. తల్లిదండ్రులు గ్రామ పెద్దలను ఆశ్రయించగా అక్కడ రాజీ కుదరకపోవడంతో బుధవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అమరావతిలో రెండో విడత భూ సమీకరణ

(మొదటిపేజీ తరువాత)

చేయనున్నామని భూ సమీకరణ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి నారాయణ ప్రకటించారు. గతంలో భూసమీకరణలో భాగంగా స్థానిక రైతులకు రుణమాఫీ చేశామన్నారు. ఇప్పుడు కూడా రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే శ్రావణ్ అడిగారని, సిఎం చంద్రబాబుతో ఈ విషయమై మాట్లాడానని తెలిపారు. ముఖ్యమంత్రి దీనికి అంగీకరించారనీ, ఈ నెల 6 వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయనున్నామని ప్రకటించారు. రూ.1.50 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేయనున్నామన్నారు. రైతులు భూములపై తీసుకున్న రుణాలను గతంలో రూ.1.5 లక్షల వరకు మాఫీ చేశారని, ఇప్పుడు కూడా అలాంటి ప్రయత్నం జరగాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ఆకాంక్షించారు. గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్ళడం, నిధులు విడుదల చేయవద్దని వరల్డ్ బ్యాంక్‌కు లేఖలు రాయడం వైసీపీకి అలవాటుగా మారిందన్నారు. గ్రామాల్లోని అంతర్గత నిర్మాణాలు, రోడ్‌లు, డ్రైన్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని శ్రావణ్ కుమార్ సూచించారు హరిశ్చంద్రపురం ఈనాం భూములు విషయంలోనూ నిర్ణయం తీసుకోవాలని, తాడికొండ నియోజకవర్గంలో ల్యాండ్ పూలింగ్ చేసిన 3 గ్రామాల్లో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి అడ్డుపడిన జగన్‌కు ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పారని శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆయన చేసిన అన్యాయంపై రైతులు నిరసన తెలిపారని చెప్పారు. ఆర్థికపరమైన అంశాల్లో కేంద్రాన్ని ఒప్పించి సీఎం చంద్రబాబు నిధులు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అన్ని విధాలుగా ఆయన కృషి చేస్తున్నారని చెప్పారు. రాజధాని అభివృద్ధిని వైకాపా ప్రభుత్వం అడ్డుకుందని.. ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.




# సిఎం కప్ క్రీడల పోస్టర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జనవరి7: సీఎం కప్`2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, సోనీబాల తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామస్థాయి, 28 నుంచి31 వరకు మండలస్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడిరచారు.

# ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు ..!

(మొదటిపేజీ తరువాత)

ఉన్నతాధికారులతో ఎస్‌ఈసీ కీలక సమావేశం నిర్వహించింది. ఈ మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని ఒక చర్చ సైతం సాగుతోంది. ఈ క్రమంలో తాజా ఆదేశాల మేరకు జనవరి 12లోగా ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని ఈ సందర్భంగా ఆయా అధికారులను ఎస్‌ఈసీ ఆదేశించింది. అలాగే జనవరి 13న టీ పోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఇక.. జనవరి 16న పోలింగ్ స్టేషన్ల వారీగా.. ఫొటోలతో కూడిన తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని సూచించింది. బ్యాలెట్ బాక్సులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎస్‌ఈసీ ఆదేశించింది. ఇక 2019 నాటి ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టం చేసింది. పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలన చేయాలని సూచించింది.



ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు, మార్పులకు అవకాశమిచ్చిందని వివరించింది. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని జారీచేసిన ఆదేశాల్లో ఎస్‌ఈసీ స్పష్టం చేసింది. జనవరి 12 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, 13 వరకు అభ్యంతరాల పరిశీలన ప్రారంభం, 16న ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదేశం ఇచ్చారు. సమావేశంలో భాగంగా కలెక్టర్లకు ముఖ్యంగా ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాల ప్రచురణపై డెడ్‌లైన్లు నిర్దేశించారు. జనవరి 12వ తేదీ నాటికి తుది ఓటర్ల జాబితాను తప్పనిసరిగా ప్రచురించాలని ఈసీ ఆదేశించింది. 13వ తేదీ నాటికి పోలింగ్ స్టేషన్ల వివరాలతో కూడిన ముసాయిదా జాబితాను విడుదల చేసి, వెంటనే టీ పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇక, జనవరి 16వ తేదీ లోపు పోలింగ్ స్టేషన్ల పూర్తి వివరాలతో పాటు ఫోటోలతో కూడిన తుది జాబితా, తుది ఓటర్ల జాబితాను వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ చర్య ద్వారా ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, వివరాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులపై కూడా ఈసీ కలెక్టర్లకు దిశానిర్దేశం చేసింది. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్/సర్వైలెన్స్ స్క్వాడ్స్ను నియమించి, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని కమిషన్ సూచించింది. మరోవైపు, ఎన్నికల ఏర్పాట్లు పారదర్శకంగా, సమయపాలనతో జరిగితేనే ప్రజాస్వామ్య ప్రక్రియ బలోపేతమవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. కలెక్టర్లు ఈ డెడ్‌లైన్లను కచ్చితంగా పాటిస్తూ, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. అయితే, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాలు ఎన్నికల వేళ కీలకంగా మారనున్నాయి. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరగాలనే లక్ష్యంతోనే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కమిషన్ వర్గాలు వెల్లడిరచాయి.

# కెసిఆర్ అప్పులు చేసింది నిజమే

(మొదటిపేజీ తరువాత)

కేటీఆర్ బుధవారం హైదబారాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రైతుబంధు ఏమైందని ప్రశ్నిస్తే.. లాగులో తొండలు వదులుతాం అంటున్నారని మండిపడ్డారు. ఎప్పటికప్పుడు న్యూఢిల్లీ పోయి కప్పం కట్టి వస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో కప్పం కట్టకపోతే తన పదవి ఉండదని.. ఊడిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌కి తెలుసునన్నారు. తాను ఆంధ్రప్రదేశ్ వెళ్లి చదువుకుంటే తప్పు.. ఆయన మాత్రం ఆంధ్రాలోని భీమవరంకు చెందిన వ్యక్తిని అల్లుడిగా తెచ్చుకోవచ్చు నంటూ కేటీఆర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను అమెరికాలో బాత్‌రూమ్‌లు కడుక్కుంటున్నానని అన్నారు. మరి అమెరికాలో మీ సోదరుడు జగదీష్ రెడ్డి కూడా ఉన్నాడని.. ఆయన తన ఇంట్లో ఆయనే కడుక్కోవట్లేదా? అంటూ సీఎం రేవంత్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ చురకలంటించారు. అమెరికాలో ఎవరింట్లో పనులు వాళ్ళే చేసుకుంటారని.. ఈ విషయం తెలయకుంటే తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రజలు.. మిమ్మల్ని గెలిపించింది ఈ పనికిమాలిన డైలాగుల కోసం కాదని.. పనిచేసి చూపించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు. యూరియా బస్తాల కోసం ప్రతి రోజు షాపుల ముందు రైతులు క్యూ కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపుల్లో యూరియా లేనప్పుడు అందుకోసం రూపొందించిన యాప్‌లు ఏమి చేస్తాయంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. యూరియా అంశంలో యాప్‌ల సమస్య రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా మళ్ళీ కార్డులు తీసుకు వస్తామని ప్రభుత్వం చెబుతుందన్నారు.



# 50 కోట్ల జిఎస్టీ పన్ను ఎగవేత

(మొదటిపేజీ తరువాత)

సమాచారంతో, భారీ స్థాయిలో జరుగుతున్న అంతర్రాష్ట్ర పన్ను మోసాల వెనుక ఉన్న కీలక వ్యక్తులపై చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జీఎస్టీ చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డ ఇద్దరు ప్రముఖ కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లను డీజీజీఐ అధికారులు అరెస్టు చేశారు. జనవరి 6న జరిగిన ఈ అరెస్టులు పన్ను మోసాల తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. మెసర్స్ ఆరెంజ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ప్రయాణికుల నుంచి వసూలు చేసిన రూ.28.24 కోట్ల జీఎస్టీని గడువు ముగిసిన మూడు నెలలు గడిచినా ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా అక్రమంగా దాచుకున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. అదే విధంగా, మెసర్స్ ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చేతన్ ఎన్ రూ.22 కోట్ల మేర నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసానికి సూత్రధారిగా వ్యవహరించినట్టు డీజీజీఐ గుర్తించింది. ఈ ఇద్దరిపై సీజీఎస్టీ చట్టం నిబంధనల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. సంఘటితంగా జరుగుతున్న పన్ను మోసాలపై నిరంతర ఒత్తిడి కొనసాగించేందుకు ఈ చర్యలు తీసుకున్నామని డీజీజీఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ స్పష్టం చేసింది. పన్ను చెల్లింపుదారులు చట్టాన్ని గౌరవిస్తూ వ్యవహరించాలని, జీఎస్టీ ఎగవేతకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని డీజీజీఐ హెచ్చరించింది.

# సంక్రాంతి సందర్భంగా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

(మొదటిపేజీ తరువాత)

కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడిరచారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పర్యాటకం అంటే కేవలం వినోదం కాదు, ఇది రాష్ట్ర ఆర్థిక రంగానికి చుక్కాని. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిస్తూ రెవెన్యూను, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంది. పర్యాటకం ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రంగాలను ప్రభావితం చేస్తుంది. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవకాశమిస్తుంది. ప్రపంచాన్ని కొత్తగా చూడటం ఎలాగో నేర్పుతుంది. హోటళ్లు, రవాణా, రిటైల్ షాపులు దీనివల్ల భారీగా లబ్ధి పొందుతాయి. అంతేకాదు.'క్రాస్ కల్చరల్ ఇంటరాక్షన్' అంటే వివిధ సంస్కృతులు,సంప్రదాయాలు,నేపథ్యాలు ఉన్నవారి మధ్య బంధం బలపడేలా చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసే రహదారులు, ఎయిర్‌పోర్టులు, తాగునీరు, పారిశుద్ధ్య సేవల అభివృద్ధి స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. నూతన పర్యాటక విధానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త సమతుల్య అభివృద్ధి కోసం 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను గుర్తించాం అని జూపల్లి అన్నారు. టూరిజం కాంక్లేవ్, గ్లోబల్ సమ్మిట్ ద్వారా 22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా సుమారు 90,000 ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో 19.44 మీటర్ల అతి పెద్ద బతుకమ్మ, 1,354 మంది మహిళలతో నృత్యం ద్వారా రెండు గిన్నిస్ రికార్డులు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశామన్నారు. మిస్ వరల్డ్ వేడుకలు, గ్లోబల్ సమ్మిట్‌ల నిర్వహణతో తెలంగాణ పెట్టుబడులకే కాదు, వ్యాపారానికి, పర్యటనకు




అత్యంత 'సురక్షితమైన రాష్ట్రం' అని నిరూపించాం అన్నారు. మన పండుగలు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ సంక్రాంతికి 'అతిథి దేవోభవ' అనే ఆత్మీయ సంస్కారంతో ఆతిథ్య రంగం సిద్ధంగా ఉందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఉత్సవంలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, కంబోడియా, థాయిలాండ్, కొరియా, జపాన్, పోర్చుగల్, వియత్నాం, మలేషియా, ఇటలీ, స్విట్జర్లాండ్, అల్జీరియా, సింగపూర్, రష్యా, ఉక్రెయిన్ / ఫ్రాన్స్ వంటి 19 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అలాగే భారత దేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారు. రాత్రి వేళ ఆకాశంలో వెలుగులు విరజిమ్మే 'నైట్ ఫ్లయింగ్'కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ కానుందని అన్నారు. తెలంగాణ స్థానిక సంస్కృతిని ప్రోత్సహించేలా రాష్ట్ర సాంప్రదాయ కళారూపాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వేదిక వద్ద సుమారు 100 చేనేత, హస్తకళల స్టాల్స్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రుచులతో కూడిన 60 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ సహకారంతో జరిగే ఈ ఉత్సవంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చి హైదరాబాద్ లో స్థిరపడిన వారు తమ ఇళ్లలో తయారు చేసిన 1,200 కంటే ఎక్కువ రకాల మిఠాయిలనుప్రదర్శిస్తారని అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జనవరి 16నుండి 18 వరకు నిర్వహించ బడుతుందన్నారు. ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన. ఉదయం పూట హైదరాబాద్ శివార్లలో, సాయంత్రం వేళ పరేడ్ గ్రౌండ్స్‌లో 'నైట్ గ్లో బెలూన్స్' ప్రదర్శన ఉంటుందన్నారు. జనవరి 16/17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలోఅత్యాధునిక డ్రోన్లు, మల్టీ `కలర్ ఎఇడి లైట్లు, గగనతల విన్యాసాలతో ఈ షో సాగనుంది. ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వం నుండి ఆధునిక ఆవిష్కరణల వరకు సాగిన ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. హైదరాబాద్ `సోమశిల `శ్రీశైలం సర్క్యూట్‌లో పూర్తిస్థాయి హెలీ టూరిజం సేవలు అందుబాటులోకి వస్తాయి. నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ ప్రాంతాలను ప్రపంచ స్థాయి వెడ్డింగ్ డెస్టినేషన్లుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా మార్చడానికి ప్రత్యేక సొసైటీ స్థాపన చేస్తున్నామని అన్నారు. పర్యాటకుల భద్రత కోసం 'టూరిస్ట్ పోలీస్' అందుబాటులోకి వస్తుందన్నారు. పర్యాటకం అంటే కేవలం సందర్శన కాదు, అది ఒక అనుభూతి. అది మనల్ని మూసధోరణుల నుంచి బయటపడేలా చేసి, మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదపడుతుంది. వారసత్వ కట్టడాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ మా ప్రభుత్వ బాధ్యత. మన పర్యాటకానికి యువత, టెక్కీలు, మీడియా, సెలబ్రిటీలు మరియు ఇన్‌ఫ్లుయెన్సర్లు రాయబారులుగా మారి... 'తెలంగాణ జరూర్ ఆనా' అంటే తెలంగాణకు తప్పక రండి అనే ఆత్మీయ పిలుపును ప్రపంచానికి చాటాలని కోరుతున్నట్లు వెల్లడిరచారు. పర్యాటకంపై అధికారులతో మంత్రి సమీక్షించి వివరాలు వెల్లడిరచారు.

# ఐ బొమ్మ రవికి కోర్టులో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాత)


ఉందని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఇటీవల నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. ఈ బెయిల్ పిటిషన్లపై బుధవారం నాడు నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తాను హైదరాబాద్ వదిలి వెళ్లనని.. పోలీసు విచారణకు సహకరిస్తానని రవి కోర్టుకు తెలిపారు. ఇకపై పైరసీ చేయనని మొర పెట్టుకున్నాడు. మరోవైపు కేసు దర్యాప్తు దశలో ఉన్నదని పోలీసులు కోర్టుకు తెలిపారు. అలాగే ఇమ్మడి రవికిరవికి పలు దేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం ఐబొమ్మ రవి అభ్యర్థనను తోసిపుచ్చింది. ఐదు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది. ఆ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# విషాదాంతం అయిన ప్రేమజంట జీవితం

- ఉరేసుకుని ప్రేమికురాలు బలవన్మరణం
- తట్టుకోలేక ప్రియుడు కూడా ఆత్మహత్య
- ఇరు కుటుంబాల్లో పెను విషాదం

హైదరాబాద్,జనవరి7: ప్రియురాలి మరణాన్ని తట్టుకోలేక ప్రియుడు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో పూజ అనే 17 ఏళ్ల యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తమ బిడ్డ ఆత్మహత్యకు కారణం అదే గ్రామానికి చెందిన సిద్దగోని మహేష్ అని మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం మహేష్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లె సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని.. నిప్పంటించుకుని తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో కూడా వీరిద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడి కోలుకున్నారు. గత కొంతకాలంగా మహేష్, పూజ ప్రేమించుకున్నట్లు సమాచారం. ఇలా ప్రేమ కారణంగా అనేక మంది యువతీ యువకులు క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. కొందరు హత్య చేస్తుండగా.. మరి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రేమలో మోసపోయామని కొందరు, పెద్దలు ఒప్పుకోలేదని మరికొందరు ఇలా తమ నూరేళ్ల జీవితాన్ని అర్ధాంతరంగా ముగిస్తున్నారు. :వారిద్దరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. జీవితాంతం కలిసి జీవించాలని కలలు కన్నారు. అందుకు పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో ఒకరు లేకుండా మరొకరు ఉండలేక చావే శరణ్యమని భావించారు. ఉరేసుకొని ప్రియురాలు పెట్రోల్ పోసుకొని నేడు ప్రియుడు ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. క్షణికావేశంతో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. దీంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.రంగారెడ్డ జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో పోతురాజు అలివేలు కూతురు పోతురాజు పూజ (16)అనే విద్యార్థిని ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. పూజా తండ్రి పదహారేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటి నుంచి తన తల్లి అలివేలు కుమారుడు కుమార్తె ఇరువురిని పెంచి పోషించింది. అదే గ్రామానికి చెందిన సిద్ధగోని యాదయ్య కుమారుడు సిద్ధగోని మహేష్ (20) గత నాలుగు ఐదు నెలలుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. విషయం ఇరు కుటుంబాల్లో తెలవడంతో వీరిని గత కొన్ని రోజులుగా కలుసుకోకుండా చేశారు. దీంతో ఇటీవలే మహేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కొన్ని రోజులు దవాఖానాలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. మహేష్ పురుగుల మందు తాగిన విషయాన్ని తెలుసుకున్న పూజ సైతం మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించింది. ఆమె సైతం ప్రాణాలతో బయటపడిరది. పెళ్లి చేసుకోకుంటే చస్తానని మహేష్ ఫోన్ చేసి చెప్పడంతో...పూజ మానసిక ఒత్తిడికి గురైంది. తన ప్రియుడు ఆత్మహత్య చేసుకుంటాడేమోనని దిగులుతో తానే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం ఎనిమిది గంటలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిరది. పూజ మృతి చెందడంతో గ్రామంలో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. పోలీసుల రంగప్రవేశంతో పూజ మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురూకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సాయంత్రం మృతదేహాన్ని తీసుకొచ్చి పూడ్చిపెట్టారు. పూజ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న మహేష్ బుధవారం హయత్ నగర్ పరిధిలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అటు పూజ ఇటు మహేష్ ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో మేడిపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇరు కుటుంబాలలో రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

# ఓయూ నియామకాల్లో నిబంధనలకు నీళ్లు!



'ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)' అంటేనే ఓ యుద్ధభూమి. అనేక సామాజిక ఉద్యమాలకు పురిటిగడ్డ.వందేమాతర ఉద్యమం మొదలు తెలంగాణ రాష్ట్రం ఏర్ప దేవరకు సాగిన మలిదశ ఉద్యమం వరకు అనేక పోరాటాలకు ఒక వేదిక. ఇక్కడ చదివే విద్యార్థుల్లో ఎక్కువ శాతం బడుగు, బలహీనవర్గాల నుంచి వచ్చినవారే. రాష్ట్రంలో నలు మూలల నుంచి నాణ్యమైన విద్యను అభ్యసించడానికి ఇక్కడికి వస్తుంటారు. అటువంటి యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీచేయక పుష్కర కాలం దాటింది. దాదాపు 75 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో నియామకాలుంటాయన్న వార్తలు నిత్యకృత్యమయ్యాయి కానీ, కార్యరూపం మాత్రం దాల్చడం లేదు. ఇటీవలే ఓయూలో పార్ట్‌టైమ్ అధ్యాపకుల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో విధి విధానాలపై స్పష్టత లేదు. ఏదో నోటిఫికేషన్ ఇచ్చామంటే ఇచ్చామన్నట్టు ఉంది.

సిలబస్ లేకుండా పరీక్షలను నిర్వహించారు. సబ్జెక్టులవారీగా నిర్వహించిన పరీక్షల్లో అభ్యర్థికి వచ్చిన మార్కుల ఆధారంగా కాకుండా, హాజరైన ప్రతి ఒక్కరిని ఇంటర్వ్యూకు పిలిచారు. పెట్టిన పరీక్షకు అసలు ఎన్ని మార్కులు కేటాయించారు? పీజీ, పీహెచ్‌డీతో పాటు నెట్ / సెట్ లాంటివాటికి ఎన్ని మార్కులను కేటాయించారో స్పష్టత లేదు. వాస్తవానికి యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులను యూజీసీ నియమ, నిబంధనల ప్రకారం భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ, వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. చాలా విభాగాల్లో పీహెచ్‌డీ పూర్తిచేసి నెట్ / సెట్ వంటి వాటిల్లో అర్హత సాధించిన వారికి కాకుండా సామాజిక సమీకరణల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్టు ఉన్నదని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓయూ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు హామీలు ఇచ్చారు. అందులో ప్రధానంగా ఓయూ తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ లాంటిదని, దాన్ని కాపాడుకోవాలని చెప్తూ ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్లను మంజూరు చేస్తూ జీవోను కూడా విడుదల చేశారు. రానున్న రోజుల్లో ఈ నిధులను ఏ మేరకు సద్వినియోగం చేస్తారో చూడాలి. ఇక నియామకాలను అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం లేకుండా, కులమతాలకతీతంగా చేపట్టాలని తెలిపారు. రెగ్యులర్ పోస్టులు దేవుడెరుగు, పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలను కూడా కుల, వర్గ ప్రాతిపదికన ఎంపిక చేస్తున్నారంటే సీఎం రేవంత్ మాటలకు యూనివర్సిటీ అధికారులు ఎంత విలువ ఇస్తున్నారో మనం అర్థం చేసుకోవచ్చు.

ఈ ఏడాది యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీకి జీవో 21ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ జీవోలో వంద మార్కులకుగాను డిగ్రీ, పీజీలతో పాటు పీహెచ్‌డీకి కూడా మార్కులను కేటాయించారు. పలు సబ్జెక్టుల్లో జాతీయస్థాయిలో నెట్ ఉత్తీర్ణతకు, రాష్ట్రస్థాయిలో సెట్ ఉత్తీర్ణతకు కూడా మార్కులను కేటాయించారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నెట్‌లో ఉత్తీర్ణత సాధించడం, రాష్ట్రస్థాయిలో నిర్వహించే సెట్‌తో పోల్చితే కొంత కఠినంగా ఉంటుంది. కనీసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జీవో 21 ప్రకారం పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలు జరుపకపోవడం శోచనీయం. నియామకాలు పారదర్శకంగా, పోటీ ఆధారంగా జరగాలి. ఇలా జరుగకుంటే యూజీసీ నిబంధనల ప్రకారం నెట్ / సెట్, పీహెచ్‌డీ వంటి అర్హతలు సాధించిన అభ్యర్థులకు అవకాశాల్లేకుండా పోతాయి. తెలంగాణలో వేలమంది అభ్యర్థులు జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణతతో పాటు పీహెచ్‌డీ పూర్తిచేసి అధ్యాపక ఉద్యోగాల కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. వారిని కాదని ఇంటర్వ్యూ ప్యానెల్లో ఉన్న వారు మా కులం వాడని, మా మతం వాడని, మా ప్రాంతం వాడని, లేదా మా భావజాలం వాడని ఇష్టం వచ్చినట్టు అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తే ఇక మెరిట్ సాధించినవారి పరిస్థితి ఏమిటి? ఇదిలా ఉంటే రెగ్యులర్ అధ్యాపకుల భర్తీ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 21లో కొన్ని మార్పులు చేయాలని ఉద్యోగార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి సూచనలకు సానుకూలంగా స్పందించి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేస్తే వేలమంది అభ్యర్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. తెలంగాణ వర్సిటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలంటే, అత్యుత్తమ ప్రతిభావంతులైన అధ్యాపకులను భర్తీచేయాల్సి ఉంటుంది. లేదంటే ప్రభుత్వ యూనివర్సిటీలు రాజకీయ నిరుద్యోగ పునరావాస కేంద్రాలుగా మిగిలే ప్రమాదం ఉన్నది.

ఇంతవరకు అన్ని వర్సిటీల్లో పూర్తిస్థాయి పాలక మండళ్లు కొలువుదీరలేదు. అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వేల ఉద్యోగాలు కాకుండా 450 అధ్యాపకుల పోస్టులను మాత్రమే భర్తీ చేస్తారని పలు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. అది కూడా కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులను మినహాయించి అంటే ఇక నిరుద్యోగులకు మిగిలే పోస్టులెన్ని? ఈ నేపథ్యంలో మరొకసారి ఖాళీలను గుర్తించి పూర్తిస్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకులను భర్తీ చేసినపుడే బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్టవుతుంది. కేంద్రం, యూజీసీ నుంచి రావాల్సిన నిధులు కూడా సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా, రాజకీయాలకతీతంగా, ఆశ్రిత పక్షపాతం లేకుండా యూనివర్సిటీల్లో ఆచార్యుల నియామకాలు చేపట్టాలన్న నిరుద్యోగ యువత ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వం అడుగులు వేయాలి. అదేవిధంగా ఇటీవల జరిగిన పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాల్లో అవకతవకలు జరిగాయన్న అంశంపై యూనివర్సిటీ అధికారులు స్పందించి అర్హులైన ఉద్యోగార్థులకు న్యాయం చేయాలి.

# అమెరికా ఆధిపత్యానికి తలొగ్గడమా

'నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి' అని మహాకవి శ్రీశ్రీ ఏనాడో ఘోషించారు. సామ్రాజ్యవాదం కొనసాగుతున్నంతకాలం ప్రపంచ చరిత్రలో ఆ నగ్న సత్యం స్థిరంగా ఉంటుందనడంలో సందేహం లేదు. గత వారం వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణిని అర్థరాత్రి పూట అమెరికా దళాలు అపహరించి తమ దేశానికి తరలించిన తీరు ఎవరికైనా ఒళ్లు గగుర్పొడిపించేసే ఘట్టం. ఇది వెనెజువెలాపై యుద్ధం కాదని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ఆ దేశాధ్యక్షుడిపై అమెరికా చట్టాల ప్రకారం చేపట్టిన చర్య మాత్రమేనని, ఆ దేశాన్ని ఆక్రమించుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో, అమెరికా చమురు కంపెనీలు వెనెజువెలాలో ప్రవేశించి వందలకోట్ల డాలర్లతో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తాయని కూడా ఆ పెద్ద మనిషి ప్రకటించారు. రాజకీయ సుస్థిరత నెలకొనేవరకు వెనెజువెలాను తామే నడిపిస్తామని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. నిజానికి గత ఆగస్టు నుంచీ అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు వెనెజువెలా చుట్టూ మోహరిస్తూ విధ్వంసక దాడులు చేస్తూనే ఉన్నాయి. అయినా గత వారాంతంలో వెనెజువెలాకు వ్యతిరేకంగా తాము చేసింది యుద్ధం కాదని ట్రంప్ నిస్సిగ్గుగా ప్రకటించారు.

వెనెజువెలా చమురు నిల్వలపై దృష్టి పెట్టినందువల్లే అమెరికా ఆ దేశాధ్యక్షుడిని అపహరించిందన్న విషయం ప్రపంచంలో ఎవరూ కాదనలేని వాస్తవం. చమురు తవ్వకాలను ప్రభుత్వ రంగంలో నిర్వహించడమే కాకుండా ఆ సహజ సంపదను డాలర్ ధరలకు కాకుండా ఇతర దేశాలకు, ముఖ్యంగా చైనాకు విక్రయించుకోవడాన్ని అమెరికా సహించలేకపోయింది. గతంలో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ తమ పెట్రోలియం ఉత్పత్తులను డాలర్ ధరలకు కాకుండా యూరోలకు అమ్ముకున్నప్పుడు కూడా అమెరికా ఇదే విధంగా వ్యవహరించింది. 2003లో ఇరాక్‌ను ఆక్రమించిన తర్వాత అమెరికా తొలుత చేసిన పని ఇరాకీ చమురును మళ్లీ డాలర్లకు అమ్ముకోవడమే. నిజానికి ఇరాక్ రసాయన ఆయుధాలు తయారు చేస్తున్నదన్న నెపంతో అమెరికా ఆ దేశాన్ని దురాక్రమించింది. అయితే ఇరాక్‌లో మూకుమ్మడి మారణాయుధాలు ఉన్నట్టు ప్రపంచానికి రుజువుచేయలేకపోయింది. డాలర్‌కు బదులు ప్రత్యామ్నాయ కరెన్సీ గురించి యోచించినందువల్లే మానవత్వ పరిరక్షణ పేరుతో లిబియా అధినేత గడాఫీని ఊచకోత కోసి ఆ దేశాన్ని సర్వనాశనం చేసేంతవరకూ అమెరికా ఊరుకోలేదు. వెనెజువెలా కూడా డాలర్‌తో నిమిత్తం లేకుండా రకరకాల కరెన్సీల్లో, బార్టర్ పద్ధతుల్లో చమురు అమ్మడం ప్రారంభించింది. చైనాకు ఆ దేశ కరెన్సీ యువాన్‌లోనే చమురు అమ్మింది. దీనితో మాదకద్రవ్యాల ఉగ్రవాదం, నియంతృత్వం, ప్రజాస్వామ్యం పేరుతో అమెరికా వెనెజువెలా




అధ్యక్షుడిని అపహరించింది.

నిజానికి ప్రపంచంలో చాలా దేశాలు ఇప్పుడు డాలర్ ఆర్థిక శృంఖలాల నుంచి విముక్తి పొందాలని ఆలోచిస్తున్నాయి. భారత్ ఈ విషయంలో ఒక అడుగు ముందుకు వేసి రూపాయి ధరకు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. అయితే తాము సాంకేతిక సర్దుబాట్లు మాత్రమే చేసుకున్నామని, డాలర్ ఆధిపత్యాన్ని ప్రశ్నించడం లేదని న్యూఢిల్లీ సర్దిచెబుతోంది. డాలర్ ఆధిపత్యం కూలిపోవడాన్ని అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. డాలర్ ఆధిక్యతను తగ్గించే ఏ అంతర్జాతీయ చట్టాలను, సార్వభౌమాధికారాలను అమెరికా సహించదు. తమ ఆర్థిక ఆధిపత్యాన్ని ఆమోదించినంతమేరకే అమెరికాకు ఏ దేశంతోనైనా స్నేహం. లేకపోతే ఇరాన్, లిబియా, వెనెజువెలా లాగా క్రూరమైన అణిచివేతలకు గురికావల్సివస్తుంది. ఆంక్షలు, తిరుగుబాట్లు, సైనిక చర్యలు చేపడతామన్న హెచ్చరికలతో వెనెజువెలాలో అల్లకల్లోలం సృష్టించిన తర్వాతే అమెరికా గత శనివారం అర్ధరాత్రి రంగంలోకి దిగింది. చైనా రాయబారితో వెనెజువెలా అధ్యక్షుడు మదురో చర్చలు జరిపి ఆ దేశంతో తమకు బలమైన సంబంధాలు ఉన్నాయని ప్రకటించిన మూడుగంటల్లోనే అమెరికా సైనిక దళాలు ఆయనను అపహరించి తమ దేశానికి తీసుకువెళ్లాయి. అసలు ఒక దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదో లేదో, అక్కడ ఎన్నికలు సక్రమంగా జరుగుతున్నాయో లేదో నిర్ధారించే హక్కు అమెరికాకు ఎక్కడిది? నిజానికి ఎన్ని అప్రజాస్వామిక, నియంతృత్వ దేశాలతో అమెరికా సంబంధాలు కొనసాగించడం లేదు? అమెరికా న్యాయస్థానాలే ప్రపంచ కోర్టుల్లాగా వ్యవహరించడం సబబేనా? ప్రపంచ దేశాల మధ్య శాంతిని సంరక్షించడం ఐక్యరాజ్యసమితి విధ్యుక్త ధర్మం. మరి వెనెజువెలాపై అమెరికా ఆగడాన్ని ఆపలేకపోయినప్పుడు సంస్థ ఉనికికి ఏమైనా అర్థం ఉన్నదా? ఒక దేశ పాలకులను ఆ దేశ ప్రజలే నిర్ణయించాలన్న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ఒడంబడికకు అర్థం ఏమైనా ఉన్నదా? అమెరికా ఎప్పుడూ ఈ నిబంధనలను పాటించలేదు. 1989లో పనామా అధ్యక్షుడు నొరెగాను బుష్ ప్రభుత్వం ఇదే విధంగా బంధించి తమ దేశానికి తీసుకువెళ్లింది. ప్రపంచంలో అనేక దేశాల్లో నాయకత్వ మార్పులకు, విధ్వంసకాండలకు పూనుకున్న అమెరికా ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు నేర్పుతూ ఉంటుంది. 2011లో సీనియర్ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ నేతృత్వంలో పాకిస్థాన్ వెళ్లిన బృందానికి అమెరికా విశ్వరూపం కనిపించింది. ఆ దేశంలో సీఐఏ ఏజెంట్ రేమండ్ డేవిస్ తన కారు వెనుక వస్తున్న ఇద్దరు పాకిస్థానీ యువకులను అనుమానించి ఉత్తి పుణ్యాన కాల్చి చంపాడు. ప్రజలు తీవ్ర నిరసన తెలిపేసరికి అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. క్షణాల్లో అమెరికా ప్రత్యేక విమానం లాహోర్‌లో దిగింది. లాహోర్ జైలులోనే విచారణ జరిపించి అతడిని విడుదల చేశారు. ఆ యువకుల కుటుంబ సభ్యులకు బ్లడ్ మనీ చెల్లించి అమెరికాలో ఉపాధి కల్పించే ఏర్పాట్లు చేశారు. అదే ప్రత్యేక విమానంలో రేమండ్ డేవిస్‌తో పాటు వారిని కూడా అమెరికాకు తీసుకువెళ్లారు.

పాక్ ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లో నిరసన తెలిపినా చేసేదేమీలేకపోయింది. రావల్పిండికి కూతవేటు దూరంలో ఉన్న అబోటాబాద్‌లో తల దాచుకున్న బిన్లాడెన్‌ను అమెరికా సైన్యాలు ఎలా హతమార్చాయో అందరికీ తెలిసిందే. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అపహరించేందుకు సహకరించిన ముగ్గురు వెనెజువెలా అధికారులను కూడా అమెరికాకు రాచమర్యాదలతో తరలించినట్లు వార్తలు వస్తున్నాయి. 1984లో భోపాల్‌లో యూనియన్ కార్బైడ్‌లో విషవాయువు లీక్ అయి వేలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన తర్వాత కూడా ఆ సంస్థ చైర్మన్, అమెరికన్ దేశస్థుడు వారెన్ ఆండర్సన్ స్వదేశానికి సురక్షితంగా పారిపోయేందుకు మన ప్రభుత్వమే వీలు కల్పించింది. ఆండర్సన్‌ను భారత్‌కు పంపించేందుకు ససేమిరా అంటోంది. మన న్యాయస్థానాలను ఎవరు లెక్కచేస్తారు? వెనెజువెలా అధ్యక్షుడిని కళ్లకు గంతలు కట్టి, చేతులకు సంకెళ్లు వేసి ఒక జంతువులా అమెరికా బంధించి తీసుకువెళ్లిన ఘటన యావత్ప్రపంచ ప్రజలను నివ్వెరపరిచింది. భారతదేశం దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. యూరోపియన్ దేశాలు ఆచితూచి స్పందిస్తున్నాయి. ట్రంప్‌ను వ్యక్తిగతంగా కానీ, అమెరికా సైనిక చర్యను కానీ తప్పుపట్టేందుకు మనం వెనుకాడవలిసి వస్తోంది. ఒక దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడం సరైనది కాదని మనం చెప్పలేకపోతున్నాం. మన విదేశాంగ శాఖ ప్రతినిధి మదురో అపహరణ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసి మిన్నకుండిపోయారు. ట్రంప్ మన దేశం పట్ల వ్యవహరిస్తున్న తీరు దృష్ట్యా ఆయనను శత్రువుగా చేసుకునేందుకు భారత్ ఏ మాత్రం సిద్ధంగా లేదు. అమెరికాతో మన ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా దిగజారిపోకూడదన్న ఉద్దేశంతో భారత్ వ్యవహరిస్తోంది. అమెరికా ఇప్పటికే మన దేశంపై 50శాతం టారిఫ్‌లను విధించింది. జౌళి ఉత్పత్తులు, ఆభరణాలు, ఇంజనీరింగ్ వస్తువులు, రసాయనాల ఎగుమతులకు భారీ నష్టాలు వాటిల్లుతున్నాయి. వాణిజ్య లోటు తీవ్రంగా పెరిగిపోతోంది. అమెరికాతో జరుగుతున్న వర్తక చర్చలు ఎప్పటికి కొలిక్కి వస్తాయో తెలియని పరిస్థితి ఉన్నది.


భారత రాయబారి వినయ్ క్వాత్రా గత నెలలో తనతో సమావేశమయ్యారని, రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించామని, టారిఫ్‌ను తగ్గించేందుకు ట్రంప్‌ను ఒప్పించాలని బతిమిలాడారని ట్రంప్ కుడిభుజం, అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం సోమవారం ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేఖరులకు చెప్పారు. ఆయన ప్రక్కనే ఉన్న ట్రంప్ స్పందిస్తూ రష్యా నుంచి చమురును కొనుగోలుచేయడం పూర్తిగా ఆపకపోతే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని హెచ్చరించారు. 'భారత్ నన్ను సంతోషపెట్టాలనుకుంటోంది. మోదీ మంచివాడే. నేను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు– రష్యా చమురు అంశంపై సహాయపడకపోతే టారిఫ్‌లను పెంచవచ్చు..' అని ట్రంప్ చెప్పారు. వెనెజువెలాపై దాడి జరిపిన తర్వాత అమెరికా భారత్‌కు చేసిన హెచ్చరిక ఇది.అమెరికా అధ్యక్షుడు అసలు మన ప్రధానమంత్రికి సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వాలి? ఆయన చెప్పినట్లు మనం ఎందుకు నడుచుకోవాలి? వ్యూహాత్మక స్వతంత్రత ఆధారంగా అంతర్జాతీయ వేదికలపై మనం తలెత్తుకోగలగాలి.

# అల్లర్లకు మార్గనిర్దేశనం ఎలా?



బెయిల్ కాదు, జైలే.. సుప్రీంకోర్టు తేల్చేసింది. ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్ పట్ల న్యాయస్థానం ఇంతకఠినంగా ఉండటం, బెయిల్ నిరాకరించడం హక్కుల ప్రేమికుల నుంచి న్యాయకోవిదుల వరకూ అందరినీ ఆశ్చర్యపరిచింది. మిగతా ఐదుగురికీ కఠినషరతులతోనైనా బెయిల్ వచ్చినందుకు ఉమర్ సంతోషిస్తున్నాడు. ఇక జైలే నా జీవితం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు నిరాశ కాదు. ఈ సర్వస్వతంత్ర, సర్వసత్తాక, ప్రజాస్వామ్యదేశంలో వ్యవస్థలు ఎంత స్వతంత్రంగా ఉన్నాయన్న అవగాహన అది.సుప్రీంకోర్టుకు మిగతావారికంటే వీరిద్దరూ ప్రమాదకారులనిపించింది. ప్రణాళికాబద్ధంగా, ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా జనసమీకరణ చేసి, అల్లర్లకు మార్గనిర్దేశనం చేశారన్న ప్రాసిక్యూషన్ వాదనను కోర్టు తన బెయిల్ నిరాకరణకు ఆధారంగా చూపింది. ఏడాది తరువాత కొత్తగా బెయిల్ దరఖాస్తు చేసుకోవచ్చునని అంతపెద్ద కుట్రదారులకూ కోర్టు వెసులుబాటు ఇచ్చింది. ఏడాదిలోగా సాక్షుల వ్యవహారం ముగింపునకు వస్తుందనో, లేదా ఏడాది తరువాత బెయిల్ ఇవ్వగల అవకాశాలు కొత్తగా పెరుగుతాయనో కోర్టు అనుకుంటోందా? బెయిల్ దక్కడానికి వారు జైల్లో గడిపిన ఈ ఐదేళ్ళకాలం రాజ్యాంగపరంగా కనీసార్హతగా సరిపోదా, అందుకు మరో ఏడాది గడువు ఏమైనా ఉందా? తెలియదు. మళ్ళీ రండి చూద్దాం అన్నంతమాత్రాన అదేమాట మళ్ళీ మళ్ళీ అనరన్న నమ్మకమేమీ లేదు. అందుకే ఉమర్ తన జీవితభాగస్వామితో ఆ మాటన్నాడు. 'ఊపా' మోపిన నిందితులందరినీ ఏకరీతిన చూడకుండా, బెయిల్ అంశాన్ని సామూహికంగా నిర్ణయించకుండా వీరిద్దరినీ వేరుపెట్టి సుప్రీంకోర్టు విభిన్నంగా వ్యవహరించడం న్యాయకోవిదులను సైతం ఆశ్చర్యపరిచింది. బెయిల్ దశలో సుదీర్ఘ విచారణలు, ఆధారాల తవ్వకాలు అంతగా అక్కరలేదని, నేరం తీవ్రతని ఉపరితలంలో గ్రహించి, సులభంగా బెయిల్ ఇవ్వాలన్నది సర్వోన్నత న్యాయస్థానం గతంలో పలుమార్లు నొక్కివక్కాణించిన న్యాయం. ఇప్పుడు అదే కోర్టు ఐదేళ్ళపాటు విచారణ లేకుండా జైల్లో మగ్గినంతమాత్రాన బెయిల్ ఇవ్వాలన్న నియమం ఏమీ లేదు పొమ్మన్నది. విచారణ ముందుకు సాగకపోవడం రాజ్యాంగ నియమాలు, విలువల ఉల్లంఘనగా కాక, ఒక సాంకేతిక తప్పిదంగా కోర్టు భావిస్తున్నట్టుంది. సెప్టెంబరులో ఢిల్లీ హైకోర్టు నిందితులపట్ల కఠినంగా వ్యవహరించినప్పుడు, ఉమర్ భాగస్వామి ఎంతో నమ్మకంగా తమకు ఇక సుప్రీంకోర్టే దిక్కని అన్నారు. బెయిల్ నియమం, జైలు మినహాయింపు అనే సూత్రం ఊపా వంటి కఠిన చట్టాలకు, ఉగ్రవాద కేసులకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసి, కొందరికి బెయిల్ కూడా ఇచ్చింది. నేర స్వభావంతో నిమిత్తం లేకుండా నిందితుడి బెయిల్ హక్కును కాపాడవలసిందేనని నొక్కివక్కాణించింది. అందువల్ల, ఈ కేసులో నిందితులు అనుభవించిన ఐదేళ్ళ ముందస్తు జైలుశిక్షకు కోర్టు మనసు కరుగుతుందని అనుకున్నారు. కానీ, 'ఊపా'లో బెయిల్ ఎంత కష్టమో తెలుసా అని సుప్రీంకోర్టు ఇప్పుడు మళ్ళీ కొత్త పల్లవి అందుకుంటోంది. సమీపకాలంలో విచారణ పూర్తికాబోదన్న నిజం తెలిసికూడా న్యాయస్థానాలు నిందితుల ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నిందితులు దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనీ, సంఘవిద్రోహశక్తులనీ ప్రభుత్వ వ్యవస్థలన్నీ ఏకమాటగా వాదిస్తున్నప్పుడు, మిగతావారంతా నమ్ముతున్నప్పుడు ఆ సత్యాన్ని రుజువుచేసే ప్రక్రియ ఇంకా ఆరంభం కాకపోవడం ఆశ్చర్యం. ఐదేళ్ళుగా విచారణ జరపకుండా, బెయిల్ మంజూరు చేయకుండా, దోషులుగా నిరూపించకుండా, నేరనిర్ధారణకు ముందే శిక్షలు అనుభవించేట్టుగా చేయడంలో ప్రభుత్వం పై చేయి సాధించింది. దిగువకోర్టులో ఎదురుదెబ్బలు అటుంచితే, సుప్రీంకోర్టులో పలు రకాల కారణాలతో ఒకే ఏడాదిలో పదిహేనుసార్లు ఉమర్ బెయిల్ పిటిషన్ పరిశీలనకు దూరంగా ఉండిపోయిన చరిత్ర ఉంది.

చివరకు, తనకు తానుగా ఆయన ఆ అభ్యర్థనను ఉపసంహరించుకొని, ఇతరత్రా వాదనలతో, బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు ఇప్పటికైనా, నిర్దిష్టకాలపరిమితిలోగా విచారణ ముగిసేట్టుగా చర్యలు తీసుకోవాలి.



# సీఎం సహాయ నిధి పేదలకు వరం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, జనవరి 06 (అక్షర గళం):** ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయ నిధి వరం లాంటిదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి లోని పోలేపల్లి గ్రామానికి చెందిన సిరిగని లింగయ్య కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ 42,500 లు మంజూరు అయ్యాయి. బుధవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో బాధితుడికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్న పేదలు అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశ్యంతో సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పోలేపల్లి మాజీ ఉప సర్పంచ్ దారెడ్డి అంజన్ రెడ్డి, మెకానిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్దే తమ లక్ష్యం

**-సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్**

**వెల్దండ వెల్దండ జనవరి 07 (అక్షర గళం):** గ్రామ అభివృద్దే తమ దేయమని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 9 వార్డు నెంబర్ ముదిగొండ కవిత రమేష్ లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో ఉన్న ముళ్ల చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి లో ముందుకు నడిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ ఎర్ర శీను ముదిరాజ్, పురుషోత్తమా చారి, పుల్లయ్య మట్ట నాగేశ్వర్ గౌడ్ గుద్దేటి కిష్టాల్ గోసుల కొండలు, రంగనాథం జంగిరి ఆనంద్ ఖలీల్,తరుణ్,మట్ట భరత్ గౌడ్,వేణు కుమార్ ,రామకృష్ణ,నాగార్జున గౌడ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి గిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య అందజేత

**వెల్దండ జనవరి 07 (అక్షర గళం):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మిర్యాల లింగం మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య కన్యాకుమారి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు మృతుని కుటుంబ సభ్యులకు 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం కానుగుల జోగయ్య కన్యాకుమారి అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లింగం ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్ యువ నాయకులు నిరంజన్ మధిరం మల్లేష్ తుంగ శ్రీను రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు



# గ్రామ అభివృద్దే తమ లక్ష్యం

**-సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్**

**వెల్దండ జనవరి 07 (అక్షర గళం):** వెల్దండగ్రామ అభివృద్దే తమ దేయమని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలిని మూడో వార్డు నెంబర్ గుద్దేటి కిష్టాల్ కాలిని యువ నాయకులతో లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో ఉన్న ముళ్ల చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి లో ముందుకు నడిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను వార్డు నెంబర్ సభ్యులు పురుషోత్తం చారి మారేపల్లి శ్రీను జంగిలి ఆనంద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య మట్ట నిరంజన్ గౌడ్ గడుసు పెంటయ్య గుద్దేటి జనార్ధన్ కాంగ్రెస్ యువ నాయకులు దాసరి మహేష్ గంగ పోగు ఆంజనేయులు కొప్పు వినోద్ కుమార్ గంగ పోగు ప్రశాంత్ ఈదులపల్లి రాజు జోగు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో భారీ బదిలీలు... కొత్త జోన్లకు ఐ పి ఎస్ అధికారుల నియామకం

**అక్షరగళం, హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం 20 మంది ఐ పి ఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నగరం, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌ల పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన జోన్లకు అధికారులను నియమిస్తూ జనరల్ అడ్మినిస్ట్రేషన్ (స్పెషల్-బీ) శాఖ బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మార్పులతో పోలీస్ పరిపాలన మరింత సమర్థవంతంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు.

**బదిలీ వివరాలు ఇలా...**
ఉత్తర్వుల ప్రకారం, హైదరాబాద్ సిటీ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)గా విధులు నిర్వహిస్తున్న తఫ్సీర్ ఇక్బాల్ ను హైదరాబాద్ సౌత్ రేంజ్‌కు అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)గా బదిలీ చేశారు. అలాగే హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీడీ)గా ఉన్న ఎన్. శ్వేతను నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)గా నియమించారు. సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్న ఎస్.ఎం. విజయ్ కుమార్ ను హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ చేశారు.

**కొత్త జోన్ లకు డి సి పి ల నియామకం**
మెద్చల్ జోన్ డీసీపీగా ఉన్న ఎన్. కోటి రెడ్డిను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీగా నియమించారు. మహేశ్వరం జోన్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న కే. నారాయణ రెడ్డిను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లోని మహేశ్వరం జోన్ డీసీపీగా కొనసాగిస్తూ కొత్త కమిషనరేట్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్ సిటీ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీగా ఉన్న రక్షిత కె. మూర్తిను హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ జోన్ డీసీపీగా నియమించారు. బాలానగర్ డీసీపీగా ఉన్న కే. సురేష్ కుమార్ ను మల్కాజిగిరి కమిషనరేట్‌లోని ఉప్పల్ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా పనిచేస్తున్న ఖరే కిరణ్ ప్రభాకర్ ను చార్మినార్ జోన్ డీసీపీగా నియమించారు. రాచకొండ కమిషనరేట్‌లోని ఎల్‌బీ నగర్ జోన్ డీసీపీగా ఉన్న డా. బి. అనురాధను మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీ నగర్ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. సైబరాబాద్ రాజేంద్రనగర్ జోన్ డీసీపీగా ఉన్న యోగేష్ గౌతమ్ ను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లోని చేవెళ్ల జోన్ డీసీపీగా నియమించారు. మాధాపూర్ డీసీపీగా ఉన్న రితిరాజ్ ను సైబరాబాద్ కమిషనరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన కూకట్‌పల్లి జోన్ డీసీపీగా బదిలీ చేశారు. హైదరాబాద్ వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న చ. శ్రీనివాస్ ను సిరిలింగంపల్లి జోన్ డీసీపీగా నియమించారు. హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీగా పనిచేస్తున్న సాధన రష్మి పెరుమాల్ ను సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాచకొండ కమిషనరేట్‌లో మల్కాజిగిరి డీసీపీగా ఉన్న చ. శ్రీధర్ ను మల్కాజిగిరి కమిషనరేట్‌లోని మల్కాజిగిరి జోన్ డీసీపీగా బదిలీ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీగా ఉన్న కె. శిల్పవల్లిను ఖైరతాబాద్ జోన్ డీసీపీగా నియమించారు. టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా పనిచేస్తున్న ఎస్. శ్రీనివాస్ ను హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌లోని రాజేంద్రనగర్ జోన్ డీసీపీగా నియమించారు. హైదరాబాద్ సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న జి. చంద్రమోహన్ ను గోల్కొండ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. రాచకొండ కమిషనరేట్‌లో ఎస్‌ఓటీ డీసీపీగా పనిచేస్తున్న ఏ. రమణ రెడ్డిను జూబ్లీహిల్స్ జోన్ డీసీపీగా నియమించారు. షంషాబాద్ డీసీపీగా ఉన్న బి. రాజేష్ ను షంషాబాద్ జోన్ డీసీపీగా నియమించారు. ఇంటెలిజెన్స్ విభాగంలో ఎస్పీగా పనిచేస్తున్న చ. సిరీషను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లోని షాద్‌నగర్ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. ఈ బదిలీలు కొత్తగా ఏర్పాటు చేసిన జోన్లు, కమిషనరేట్‌లలో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా చేపట్టినవిగా ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త నియామకాలతో లా అండ్ ఆర్డర్ పరిపాలన మరింత పటిష్టంగా అమలవుతుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.



# పేదల సొంతింటి కల సాకారం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, జనవరి 06 (అక్షర గళం):** పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కే దక్కిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. సర్పంచ్లు, నాయకులు సమన్వయంతో పనిచేసి రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. గృహప్రవేశం చేసిన దంపతులను శాలువాతో సత్కరించి, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, అబ్దుల్ ఖాదర్, ఖాదర్ ఖాద్రి, అంజన్ రెడ్డి, పులికంటి మైసయ్య, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ నాయక్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, శ్రీను నాయక్, నాజర్, దేవరశెట్టి మహేష్, సురేష్ నాయక్, శేఖర్ గౌడ్, గౌస్, కుమార్ గౌడ్, శివ, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడ ఎమ్మెల్యేను కలిసిన జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్

**అక్షర గళం, కూకట్ పల్లి :** జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ రాజన్న సిరిసిల్ల (యూసీఈఆర్)కు సంబంధించిన సమస్యలపై బుధవారం వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి , రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వర రావు లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ 20212022 విద్యా సంవత్సరంలో స్థాపించబడిన జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ రాజన్న సిరిసిల్ల (యూసీఈఆర్)కు సంబంధించిన ప్రస్తుత సమస్యలు , అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. యూసీఈఆర్‌లోని విద్యార్థులు, అధ్యాపకులు , సిబ్బందితో సహా అందరితో త్వరలోనే తాను సమావేశమవుతానని ఎమ్మెల్యే తెలిపారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలకు నిధులు, మౌలిక సదుపాయాలు , సిబ్బంది అవసరాల విషయంలో తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# పేద రైతుల భూములను ప్రభుత్వం గుంజుకోవడం అన్యాయం

**జాతీయ మాలమహానాడు సంఘం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం**



**కీసర , జనవరి 07(అక్షర గళం):** కీసర మండల పరిధిలోనీ రాంపల్లి గ్రామ శివారులో గత 60 ఏళ్లుకు పైగా సాగు చేసుకుంటున్నా రైతుల భూముల జోలికి వస్తే సహించేది లేదని జాతీయ మాలమహానాడు సంఘం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం హెచ్చరించారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమినీ వారికి దక్కేంతవరకు పోరాటం చేస్తామని పేద దళితులు , బీసీ లు ఎన్నో ఏండ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతుంటే ప్రభుత్వం పేదల భూములను గుంజుకోవడం అన్యాయమని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కీసర మండలం , రాంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 388 ప్రభుత్వ భూమి లో గత కొన్ని ఏండ్లుగా గ్రామంలోని దళితులు ,బీసీ లు 300 మంది కుటుంబాలు 24 ఎకరాల ప్రభుత్వ భూమిని చదును చేసి,వ్యవసాయం చేసుకుంటూ బ్రతుకుతున్నారు. అందులో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని హెచ్ హెమ్ డబ్ల్యు ఎస్ వాటర్ వర్క్స అధికారులు సేవారేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ కొరకు తీసుకోవడం చాలా దారుణం అన్నారు. చాలి చాలని బ్రతుకులతో... ఆ భూముల పై పుట గడుపుతున్న వారి పై ప్రభుత్వం మోసం చేయడం సరియైన నిర్ణయం కాదని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేనియెడల బాధిత కుటుంబాలతో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను హెచ్చరించారు.

# ముగ్గురు నిందితుల అరెస్ట్

**కల్వకుర్తి జనవరి 7 (అక్షర గళం):** ఏపీలోని అనంతపుర్ జిల్లా పడపనకల్ పోలీస్ స్టేషన్ నుంచి నాగిరెడ్డి నీ తీసుకొచ్చి విచారించగా అతను నేరాలు ఒప్పుకున్నాడు. దర్యాప్తులో సహకరించకుండా తప్పుడు సమాచారం ఇచ్చి అందుకునే ప్రయత్నం చేశాడు. నవంబర్ 13న కల్వకుర్తి పోలీస్ స్టేషన్ కస్టడీ నుంచి తప్పించుకున్నాడు ప్రత్యేక గాలింపులు చేపట్టగా ఈనెల 6న హైదరాబాదులోని ఎల్బీనగర్లో నాగిరెడ్డిని పట్టుకున్నారు నిందితుని కల్వకుర్తి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా జ్యూడిషల్ రిమాండ్ కు పంపించినట్లు కల్వకుర్తి సీఐ తెలిపారు.






# మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**

**ఆమనగల్లు, జనవరి 07(అక్షరగళం):** ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. బుధవారం రూ. 2 కోట్లతో నిర్మించే ఆమనగల్లు మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన , రూ 2.10 కోటకు చేపట్టే మురుగు కాల్వల నిర్మాణానికి అధికారులతో కలిసి స్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపాలిటీ దశ దిశ మారుస్తామని, ప్రజలు కోరుకున్న విధంగా గెలిచిన అభ్యర్థులకు నడుచుకుంటారని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లబ్దిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును లబ్ధిదారులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, అబ్దుల్ ఖాదర్, ఖాదర్ ఖాద్రి, మెకానిక్ బాబా, అంజన్ రెడ్డి, పులికంటి మైసయ్య, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ నాయక్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, శ్రీను నాయక్, నాజర్, దేవరశెట్టి మహేష్, సురేష్ నాయక్, శేఖర్ గౌడ్, గౌస్, కుమార్ గౌడ్, శివ, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# మండల సర్పంచుల సంఘం అధ్యక్షులుగా భాగ్యమ్మ పూల్ సింగ్ నాయక్

**వెల్దండ జనవరి 07 (అక్షర గళం):** వెల్దండ మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మర్రిగుంత తండా సర్పంచ్ భాగ్యమ్మ పూల్ సింగ్ నాయక్ ను ఎన్నుకున్నారు సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ పూల్ సింగ్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యక్షులు ఎనుముల సంగీత శేఖర్ రెడ్డి, బండోనిపల్లి సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ, పెద్దాపూర్ సర్పంచ్ తిరుగుడు మంజుల రాజు యాదవ్ బైరాపూర్ సర్పంచ్ ప్రధాన కార్యదర్శి గున్నెళ్ళ శ్రీనివాస్ లను మండలంలోని 32 గ్రామపంచాయతీల సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ బొల్లంపల్లి సర్పంచ్ సత్తూరి ప్రసాద్ ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను కొయ్యల పుల్లయ్య ముదిగొండ రమేష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పాలకవర్గానికి సన్మానం

**కల్వకుర్తి జనవరి 7 (అక్షర గళం):**
తలకొండపల్లి మండలం చౌదర్పల్లి గ్రామ పంచాయతీకి బుధవారం నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మెదిగి భారతమా గోపాల్, ఉప సర్పంచ్ జ్యోతి ప్రదీప్ రెడ్డి, వార్డు సభ్యు లను మండల విద్యాధికారి చాంప్లా నాయక్ ప్రాథమిక పాఠశాల ప్రధానో ఉపాధ్యాయులు జంగయ్య విజయలక్ష్మి పాఠశాల సిబ్బంది పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు.

# పేదల బడుగు బలహీన వర్గాల పెన్నిధి

**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సీ ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**
**కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు సుంకి రెడ్డికి రుణపడి ఉండాలి**



**కల్వకుర్తి జనవరి 7 (అక్షర గళం):** పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాలకు సామాజిక సేవలు అందిస్తూ గుడి గోపురాలకు బడి తేడా లేకుండా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ప్రతినిత్యం ప్రజల కోసం తలపిస్తున్న నాయకుడు సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి అని నియోజకవర్గ ప్రజలు జేజేలు పలుకుతున్నారు. అడగాలే కానీ ఏదైనా ఇచ్చే గొప్ప మనసున్న మహారాజని నియోజకవర్గంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని కంటి చూపులేని పేదలకు వెలుగునిచ్చిన మహానుభావుడని సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డిని గుండెల్లో శిరస్థాయిగా చరిత్రలో ఒక మహోన్నతుడుగా నిలిచిపోతారని ప్రజలను విశ్వసిస్తున్నారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఎంతోమందికి సేవ చేయడానికి ఆలు పెరగని యోధుడని కొనియాడుతున్నారు. నియోజకవర్గ ప్రజల పూర్వజన్మ శుకృతం అని ఇలాంటివారు దొరకడం జన్మజన్మల మనం చేసుకున్న పుణ్యమని నియోజకవర్గ ప్రజలు సుంకిరె రాఘవేందర్ రెడ్డి ని కోరుకుంటున్నారు.



# మౌలిక వసతులకు సహకారం

**అందజేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు**
**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**కల్వకుర్తి జనవరి 7 (అక్షర గళం):**
మాడుగుల గ్రామ అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు బుధవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారం అందించాడు ఎల్ ఈడి లైట్స్ కు భాను 1,50,000 చెక్కును పంచాయతీ పాలకవర్గానికి అందజేశారు. సందర్భంగా సుంకిరెడ్డికి సర్పంచ్ రజిత దేవయ్య గౌడ్, ఉపసర్పంచ్ సుధీర్ శరత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కిషోర్ రెడ్డి, సుధీర్ కొండల్ రెడ్డి, కాట్ల యాదయ్య, మాజీ ఎంపీపీ అన్ని పాక జంగయ్య. మార్కెట్ కమిటీ డైరెక్టర్ జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పెద్దయ్య యాదవ్ ను పరామర్శించిన కేవీఎన్ రెడ్డి

**కల్వకుర్తి జనవరి 7 (అక్షర గళం):** నాగర్ కర్నూల్ జిల్లా జూపల్లి మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్. పెద్దయ్య యాదవ్ తన గాలికి గాయం తో కొంతకాలంగా తీవ్ర ఇబ్బంది పడ్తున్నారు. రెండు రోజుల క్రితం ఎల్బీ నగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్సపొందుతున్నరు పెద్దయ్య యాదవ్. ఈ విషయం తెలుసుకొన్న రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి బుధవారం ప్రత్యేకంగా హాస్పిటల్ కు వెళ్లి పెద్దయ్య యాదవ్ ను పరామర్శించడం జరిగింది. పెద్దయ్య యాదవ్ కు ప్రభుత్వం తరుపున ఎలాంటి సాయం చేయడానికైనా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని పెద్దయ్యకు, ఆయన కుటుంబ సభ్యులకు కేవీఎన్ రెడ్డి భరోసా ఇచ్చారు.




# గ్రామ అభివృద్ధి, విద్యాభివృద్ధికి కృషి చెయ్యాలి

**పంచాయతీ పాలకవర్గానికి ఘన సన్మానం..**
**- మండల విద్యాధికారి చాంప్లానాయక్**

**ఆమనగల్లు, జనవరి 07(అక్షర గళం):**
నూతనంగా గెలుపొందిన గ్రామపంచాయతీ సర్పంచులు,వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధితోపాటు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాధికారి చాంప్లానాయక్ అన్నారు.బుధవారం తలకొండపల్లి మండలం చౌదర్ పల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన పంచాయితీ సర్పంచ్ మేరీగా భారతమ్మ గోపాల్,ఉప సర్పంచ్ తడిసిన జ్యోతి ప్రదీప్ రెడ్డి,వార్డు సభ్యులు తిర్మణి శేఖర్ గౌడ్,దుడ్డు మల్లమ్మ,తడిసిన సుమతమ్మ,తడిసిన చంద్రశేఖర్ రెడ్డి,కాలే మహేష్,తూర్పు శివలక్ష్మి,సప్పిడి గణేష్,లను ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య,ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి,ల ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన సన్మాన సభకు ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి చాంప్లా నాయక్ హాజరై ప్రసంగించారు.గ్రామంలో మౌలిక వసతుల ను కల్పించడంతోపాటు ప్రభుత్వ పాఠశాల విద్యాభివృద్ధికి కృషి చేయాలని పాలకవర్గానికి సూచించారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు కావలసిన వసతులను సమకూర్చాలని కోరారు.అనంతరం హెచ్ఎం జంగయ్య మాట్లాడుతూ..ఎన్నికైన వెంబడే సర్పంచ్ మేరిగా భారతమ్మ,ఉప సర్పంచ్ జ్యోతి ప్రదీప్ రెడ్డి,లు సొంత నిధులను చెల్లించి పాఠశాలకు విద్యా వాలంటరీని నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యా బోధనకు కావలసిన ఒక ప్రొజెక్టర్ ను ,అందించే విధంగా చూడాలని కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ భారతమ్మ గోపాల్,ఉపసర్పంచ్ తడిసిన జ్యోతి ప్రదీప్ రెడ్డి,లు మాట్లాడుతూ..పాఠశాలకు కావలసిన కనీస అవసరాలను పరిష్కరించడానికి తమ వంతు సహకారం అందిస్తామని,విద్యా బోధనకు కావలసిన ప్రొజెక్టర్,ను తొందర్లోనే పాఠశాలకు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మహేందర్,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తడిసిన ప్రదీప్ రెడ్డి,మేరిగా గోపాల్, మాజీ వార్డు సభ్యులు తూర్పు శ్రీను,పాఠశాల చైర్మన్ పద్మ,విద్యా వాలంటీర్ రమ్య,పాఠశాల సిబ్బంది,గ్రామపంచాయతీ సిబ్బంది,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు

**ముగ్గురు మంత్రులు ఉన్నా ఒరిగిందేమీ లేదు**
**బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్**

**ఖమ్మం,జనవరి7:**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. నాడు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడం కోసం కేసీఆర్‌గారు సీతారామసాగర్ ప్రాజెక్టును నిర్మించతలపెట్టి 90 శాతం పనులను పూర్తిచేశారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో 7.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, గోదావరి జలాలపై పూర్తి హక్కులు ఖమ్మం జిల్లాకే దక్కాలని నాడు కేసీఆర్ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కవిరాషన్‌లకు కక్కుర్తిపడి ప్రాజెక్టును పక్కనపెట్టారని మండిపడ్డారు. ఆ ముగ్గురు మంత్రులు ప్రజలకు మేలు చేయగల మొనగాళ్లు కాదని, మోసగాళ్లని కేటీఆర్ విమర్శించారు. వారు 30 శాతం చొప్పున కమిషన్‌లు వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప జిల్లాకు పనికొచ్చే పనులు ఒక్కటి కూడా చేయడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో ఈస్ట్‌మన్ కలర్‌లో సినిమా చూపెట్టారని, ఇదిస్తాం.. అదిస్తాం అని నోటికొచ్చిన హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఏదీ ఇవ్వలేదని విమర్శించారు. అశ్వారావుపేటలో ఒక్క సీతారామసాగర్ ప్రాజెక్టు ద్వారా 1.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా కేసీఆర్ డిజైన్ చేశారని కేటీఆర్ చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, ఇల్లందు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు, కొత్తగూడెంలో 10 వేల ఎకరాలకు, వైరాలో 20 వేల ఎకరాలకు నీళ్లిచ్చేలా కేసీఆర్‌గారు సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేశారు. కానీ ఆ ప్రాజెక్టును ప్రభుత్వం పక్కనపెట్టింది. ఈ రెండేళ్లలో ప్రభుత్వం చేసింది ఏమైనా ఉందంటే.. అది ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలేనని, కేటీఆర్ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్, రాజ్యసభ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.




# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**నవీన్ రావు తండ్రికి సిట్ నోటీసులు**

**హైదరాబాద్,జనవరి7:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండల్ రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అంతేకాదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొడుకు సందీప్ రావుకు కూడా నోటీసులు ఇచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జూబ్లీహిల్స్ పీఎస్‌కి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ అధికారులు విచారించారు. దాదాపు 9 గంటల పాటు విచారణ సాగింది. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ రాత్రి 8 గంటల వరకు సాగింది. బీఆర్ఎస్ పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాల గురించి నవీన్ రావును అధికారులు విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం నవీన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో విచారణకు హాజరయ్యానని, అప్పట్లో మూడు గంటల పాటు అధికారులు తనను విచారించారని చెప్పారు. విచారణకు సహకరించానని, మళ్లీ పిలిచినా కూడా వస్తానని స్పష్టం చేశారు.

# డైలీ సీరియల్‌లా ఫోన్ ట్యాపింగ్ విచారణ

**అన్ని వేళ్లూ ఒకేవైపు చూపిస్తున్నా చర్యలేవీ**
**అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ పారిపోయింది**
**బిజెపి మాత్రమే సమర్థ విపక్షంగా పనిచేసింది**
**మెదక్ ఎంపి రఘునందన్ రావు**



**మెదక్,జనవరి7:** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ డైలీ సీరియల్‌లా సాగుతోందని బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మెదక్‌లో రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు డైలీ సీరియల్‌లా సాగుతోందని వ్యంగ్యంగా అన్నారు. కొండను తవ్వి ఎలుకను ఈ సిట్ పడుతుందో లేదో అంటూ సందేహం వ్యక్తం చేశారు. డేటాను సర్వీస్ ప్రొవైడర్ల వద్ద తీసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. నేడు కొండల్ రెడ్డి, రేపు ఆయన డ్రైవర్ ఇలా ఎన్నాళ్లు అంటూ? సిట్ వ్యవహారశైలిపై ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. కర్త, కర్మ అన్ని ఒకరివైపే వేలు చూపిస్తున్నాయని.. కానీ ఆయనను పిలిచేందుకు భయపడుతున్నారంటూ రఘునందన్ పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తతంగమంతా ఎన్నికల కోసం పిలుస్తున్నట్లుగా ఉందన్నారు.(కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్)లా మారిందంటూ ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫస్ట్ బాధితుడిని తానేనని గుర్తు చేశారు. మొక్కుబడిగా ఐదు రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిం దంటూ రాష్ట్ర ప్రభుత్వంపై రఘునందన్ రావు మండిపడ్డారు. అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి.. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పూర్తి వైఫల్యం చెందిందని విమర్శించారు. నీటి అంశాలపై చర్చకు పాలక పక్షం మీనమేషాలు లెక్కిస్తే.. బీఆర్ఎస్ పార్టీ భయపడి పారిపోయిందని పేర్కొన్నారు. తమ సంఖ్య తక్కువ ఉన్నా గట్టిగా పోరాడి.. పాలక పక్షాన్ని బీజేపీ నిలదీసిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపి శాసనసభా పక్ష నేత మహేశ్వర రెడ్డిని అభినందిస్తున్నానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుంటే.. 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా సభలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పాలమూరు జిల్లా మీద, కృష్ణా జలాల మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఇదంటూ అధికార పార్టీ సభ్యులపై నిప్పులు చెరిగారు. కొంతమంది తమ పార్టీ నుంచి వలసపోతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆలోచించుకోవాలంటూ వలస నేతలకు ఈ సందర్భంగా ఆయన కీలక సూచన చేశారు. యెన్నెం శ్రీనివాస రెడ్డి కూడా తమ పార్టీ నుంచి వెళ్లిన వారేనని గుర్తు చేశారు. ఆలోచించుకోవాలంటూ ఆయనకు హితవు పలికారు. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌లపై పోరాడేది.. ప్రజల పక్షాన ఉండేది బీజేపీ మాత్రమేనని ఎంపీ స్పష్టం చేశారు. తమ పార్టీలో కొత్త పాత అనేది ఏమీలేదని కుండబద్దలు కొట్టారాయన. కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపిస్తే.. దేశంలో 6202వ పార్టీ అవుతుందన్నారు. ఎవరు కొత్త పార్టీ పెట్టిన తాము స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఒక నటుడు సినిమాకు టికెట్ల ధర పెంచి మరో నటుడికి పెంచకపోతే అది పక్షపాతం అవుతుందన్నారు. అందరికీ ఒకటే రూల్ ఉండాలి.. అన్ని సినిమాలకు ఒకటే రూల్ ఉండాలని రఘునందన్ తెలిపారు.

## వెండికీ హాల్‌మార్కింగ్



బంగారాన్ని మించి వెండి పగ్గాలు లేకుండా పరుగులు పెడుతోంది. ఇలాంటి సమయంలో వినియోగదారులు మోసాల బారినపడకుండా దానికి కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఈ మేరకు భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ వెల్లడించారు. ప్రస్తుతం వెండికి బంగారంలా హాల్‌మార్కింగ్ తప్పనిసరి కాదు. ''వెండికి కూడా తప్పనిసరిగా హాల్‌మార్కింగ్ ఉండాలని పరిశ్రమ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా నిబంధనలు తీసుకురావడానికి ముందు అవసరమైన వనరుల గురించి అంచనా వేస్తున్నాం'' అని గార్గ్ వెల్లడించారు. ప్రస్తుతం స్వచ్ఛందంగా జరుగుతోన్న హాల్‌మార్కింగ్ వ్యవస్థలో భాగంగా వెండి వస్తువులపై హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ కనిపిస్తోంది. దానిద్వారా వినియోగదారులు చెల్లించిన నగదుకు తగిన స్వచ్ఛత ఆయా ఆభరణాలు, వస్తువుల్లో ఉందా అనేది నిర్ధరించుకునేందు వీలు కలుగుతోంది.

ఈ మార్కింగ్ ఉన్న వెండి వస్తువుల సంఖ్య 2024లో 31 లక్షలుగా ఉండగా.. 2025లో 51 లక్షలకు చేరిందని గార్గ్ తెలిపారు. అయితే, వెండిని కరిగించి, చిన్నపాటి ఆభరణాలు తక్కువ విలువలో చేస్తుంటారని.. వీటికి హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ పత్రాలు అందించడం కొంత సవాలేనని బీఐఎస్ అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

## 1న బడ్జెట్.. 28 నుంచి బడ్జెట్ సమావేశాలు..?



**ఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 28 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. రెండు దఫాల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఫిబ్రవరి 1న బడ్జెట్ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. దీనిపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఒకప్పుడు ఫిబ్రవరి నెల చివరి రోజు బడ్జెట్ ప్రవేశపెట్టే సంప్రదాయం ఉండేది. దాన్ని 2017లో ఫిబ్రవరి 1కి మార్చారు. అయితే, ఈ సారి ఫిబ్రవరి నెలలో మొదటి తేదీ ఆదివారం కావడంతో బడ్జెట్ ప్రవేశపెట్టే అంశంపై ఆసక్తి నెలకొంది. స్టాక్ మార్కెట్ సహా ఇతర ఆర్థిక కార్యకలాపాలేవీ ఆ రోజు జరగవు. దీంతో బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీ ఏమైనా మారుస్తారా? అన్న చర్చ జరుగుతోంది. అయితే, ఈ తేదీ మార్చకూడదని ప్రభుత్వం భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఇక బడ్జెట్ తొలి దశ సమావేశాలు జనవరి 28న ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఆ రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉండనుంది. 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం. జనవరి 30, 31 తేదీల్లో సెలవులు రానున్నాయి. రెండో దశ సమావేశాలు మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే అవకాశం ఉంది. వరుసగా తొమ్మిదోసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అత్యధికంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా మొరార్జీ దేశాయ్ రికార్డు ఉంది. ఆయన రెండు దఫాల్లో 10 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

## ఒప్పో సబ్‌బ్రాండ్‌గా రియల్‌మీ.. వ్యూహం ఇదే..




ప్రముఖ చైనా మొబైల్ కంపెనీ రియల్‌మీ మరో చైనీస్ కంపెనీ ఒప్పో గూటికి చేరింది. ఇకపై ఒప్పో సబ్ బ్రాండ్‌గా కార్యకలాపాలు నిర్వహించనుంది. ఈ విలీనం ద్వారా వనరులను సమర్థవంతంగా వాడుకుంటూ, మార్కెట్లో మరింత వృద్ధి చెందాలని ఇరు సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. విలీనం తర్వాత రియల్‌మీ నుంచి రావాల్సిన ఫోన్లు షెడ్యూల్ ప్రకారమే విడుదల కానున్నాయి. విక్రయానంతర సేవలు ఒప్పోలో విలీనం కానున్నాయి. బడ్జెట్ సెగ్మెంట్‌లో షావోమీకి పోటీగా స్మార్ట్‌ఫోన్‌లను లాంచ్ చేసి గుర్తింపు తెచ్చుకున్న రియల్‌మీకి.. భారత్‌తో పాటు ఆగ్నేయాసియా, యూరప్‌లో మంచి మార్కెట్ ఉంది. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా తాజా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వన్‌ప్లస్ కూడా ఒప్పో సబ్‌బ్రాండ్‌గా కొనసాగుతోంది. మరోవైపు ఒప్పో, వివో సంస్థలకు బీబీకే ఎలక్ట్రానిక్స్ సంస్థ మాతృ సంస్థగా వ్యవహరిస్తోంది. అంటే పేరుకే పోటీ కంపెనీలుగా చలామణీ అవుతున్నా.. ఒకే గ్రూప్‌నకు చెందిన కంపెనీలన్నమాట! పేర్లు వేరైనా తమ తమ మార్కెటింగ్ వ్యూహాలతో ముందుకెళుతున్నాయి.

## కంటి వ్యాధులకు ఆధునిక చికిత్స

**హైదరాబాద్:** కంటి వ్యాధులకు అత్యాధునిక చికిత్సను అందించే దిశగా న్యూసెలియన్ థెరప్యూటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో, పాండోరమ్ టెక్నాలజీస్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఆసియాపసిఫిక్ మార్కెట్ల కోసం ఎక్సోజోమ్ ఆధారిత కణజాల పునరుద్ధరణ చికిత్సల తయారీని విస్తరించడమే ఈ ఒప్పంద లక్ష్యం. వ్యాక్సిన్ల తయారీ సంస్థ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్‌కు పూర్తి స్థాయి అనుబంధ సంస్థ న్యూసెలియన్ థెరప్యూటిక్స్. కాంట్రాక్టు పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి సేవల (సీఆర్‌డీఎంఓ) విభాగానికి చెందిన టిష్యూ ఇంజినీరింగ్, రీజనరేటివ్ మెడిసిన్ సంస్థ పాండోరమ్ అభివృద్ధి చేసిన కురాజెనెక్స్ అనే వినూత్న చికిత్సను భారీ స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు అవసరమైన పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను న్యూసెలియన్ అందించనుంది. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం కంటి ఉపరితల గాయాలు, స్టీవెన్స్‌జాన్సన్ సిండ్రోమ్, న్యూరోట్రోఫిక్ కెరాటిటిస్ వంటి తీవ్ర కంటి సమస్యలపై దృష్టి సారిస్తోంది. రాబోయే రోజుల్లో చర్మం, ఊపిరితిత్తులు, ఇతర అవయవాల వాపు, ఫైబ్రోసిస్ వంటి సమస్యలకూ ఈ చికిత్సలను విస్తరించాలని పాండోరమ్ లక్ష్యంగా పెట్టుకుంది. సంక్లిష్ట బయోలాజిక్స్ తయారీకి తమ వద్ద అత్యాధునిక తయారీ వేదికలు ఉన్నాయని న్యూసెలియన్ ముఖ్య వ్యాపార అధికారి (సీబీఓ) రఘు మలపాక వివరించారు. తాజా ఒప్పందం భారత అత్యాధునిక బయోలాజిక్ థెరపీల తయారీ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెబుతుందని పాండోరమ్ సీఈఓ తుహిన్ భౌమిక్ అన్నారు.

# ఒకసారి కడితే జీవితాంతం ఆదాయం..!




ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరికొత్త బీమా పాలసీ 'జీవన్ ఉత్సవ్'ను అందుబాటులోకి తెచ్చింది. పొదుపు, బీమా కోరుకునే వారి కోసం సింగిల్ ప్రీమియం ఆప్షన్‌తో దీన్ని లాంచ్ చేసింది. అంటే ఒకసారి ప్రీమియం చెల్లిస్తే జీవితాంతం ఆదాయం (100 ఏళ్ల వరకు) పొందొచ్చు. ఇది నాన్ పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్, సింగిల్ ప్రీమియం ప్లాన్. అంటే మార్కెట్‌తో సంబంధం ఉండదు. ఎల్ఐసీ లాభాలను పాలసీదారులకు చెల్లించదు. జనవరి 12 నుంచి కొనుగోలుకు అందుబాటులోకి వస్తుంది.

- 30 రోజుల వయసున్న పిల్లల నుంచి గరిష్ఠంగా 65 ఏళ్ల వయసున్న వారు ఈ పాలసీని ఎంచుకోవడానికి అర్హులు.
- కనీస ప్రాథమిక బీమా మొత్తం రూ.5 లక్షలు. ఆపై ఎంత మొత్తం అయినా ఎంపిక చేసుకోవచ్చు. గరిష్ఠ పరిమితి లేదు.
- పాలసీ కాలపరిమితిలో ప్రతి రూ.వెయ్యికి ఏటా రూ.40 చొప్పున గ్యారంటీడ్ అడిషన్స్ (GA) కింద జమ అవుతాయి.
- ఇందులో రెండు రకాల ఆప్షన్లు ఉంటాయి. రెగ్యులర్ బెనిఫిట్ ఆప్షన్ (ఆప్షన్1) కింద పాలసీదారులు ఎంచుకున్న వ్యవధిని బట్టి (7 నుంచి 17 ఏళ్ల తర్వాత) ఏటా ప్రాథమిక బీమా మొత్తంలో 10% ఆదాయం లభిస్తుంది. అంటే ఎంపిక సంవత్సరాన్ని బట్టి మరుసటి ఏడాది నుంచి ఆదాయం రావడం ప్రారంభం అవుతుంది. వ్యక్తుల అవసరాలను బట్టి దీన్ని ఎంచుకోవచ్చు.
- ఫ్లెక్సీ ఇన్‌కం బెనిఫిట్ ఆప్షన్ (ఆప్షన్2) కింద పాలసీదారులు తమకు రావాల్సిన 10% ఆదాయాన్ని అప్పుడే తీసుకోకుండా ఎల్ఐసీ వద్దే దాచి పెట్టొచ్చు. ఇలా ఉంచిన మొత్తంపై సంస్థ వార్షిక వడ్డీ 5.5% (వార్షిక చక్రవడ్డీ) చెల్లిస్తుంది. పాలసీదారులు తమ అవసరానికి అనుగుణంగా ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. అప్పటివరకు జమ అయిన మొత్తంలో 75 శాతం వరకు వెనక్కి తీసుకోవచ్చు.
- పాలసీ వ్యవధిలో పాలసీదారు మరణిస్తే నామినీకి పాలసీ మొత్తంతో పాటు, అప్పటివరకూ జమైన గ్యారంటీడ్ అడిషన్స్ అందుతాయి. గడువు తీరే వరకూ జీవించి ఉంటే, మెచ్యూరిటీ ప్రయోజనం కింద ప్రాథమిక బీమా మొత్తం లేదా సింగిల్ ప్రీమియానికి 1.25 రెట్లు (ఏది ఎక్కువగా ఉంటే అది), గ్యారంటీడ్ అడిషన్స్ కలిపి చెల్లిస్తారు.
- ఎల్ఐసీ యాక్సిడెంట్ డెత్ అండ్ డిజెబిలిటీ బెన్‌ఫిట్ రైడర్, ఎల్ఐసీ న్యూటర్మ్ అష్యూరెన్స్ రైడర్ వంటివి జోడించుకోవచ్చు. ఇందుకు కొంత అదనపు ప్రీమియం చెల్లించాలి. వీటిని పొందేందుకు కొన్ని అర్హత ప్రమాణాలను నిర్దేశించారు. ఉదాహరణతో ఈ పాలసీని చూద్దాం..
- 35 ఏళ్ల సాగర్ రూ.10 లక్షల బీమా హామీతో పాలసీ తీసుకున్నారనుకుందాం. గ్యారెంటీడ్ అడిషన్ పీరియడ్‌ను 10 ఏళ్లు ఎంపిక చేసుకుంటే.. సింగిల్ ప్రీమియం కింద రూ.8,08,650 చెల్లించాల్సి ఉంటుంది. అతడికి 45 ఏళ్లు వచ్చిన తర్వాత ఆదాయం రావడం మొదలవుతుంది. ఏటా రూ.లక్ష చొప్పున అతడికి వందో ఏట వచ్చేవరకు చెల్లిస్తారు. 10 ఏళ్ల పాలసీ కాలానికి గానూ గ్యారెంటీడ్ అడిషన్ కింద ఏడాదికి రూ.40 వేలు చొప్పున కలుస్తుంది. పాలసీ మధ్యలో పాలసీదారుడికి ఏదైనా జరిగితే నామినీకి రూ.14.22 లక్షలు చెల్లిస్తారు. అదే ఫ్లెక్సీ ఇన్‌కం ఎంచుకుంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు జమైన మొత్తంలో 75 శాతం చొప్పున తీసుకునే వెసులుబాటు ఉంటుంది. మొత్తం నిల్వలపై 5.5 శాతం వడ్డీని ఎల్ఐసీ చెల్లిస్తుంది.

## మూడో రోజూ నష్టాల్లోనే స్టాక్ మార్కెట్ సూచీలు




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు ప్రతికూల ప్రభావం చూపాయి. దీనికితోడు ఎఫ్ఐఐల విక్రయాలు, త్రైమాసిక ఫలితాల సీజన్ వేళ మదుపర్లు అప్రమత్తత పాటించడమూ మరో కారణం. ఆటోమొబైల్, ఆయిల్ గ్యాస్ షేర్లు సూచీలు నష్టాలు చవిచూడగా.. కన్జూమర్ డ్యూరబుల్స్, ఐటీ షేర్లు రాణించాయి.

సెన్సెక్స్ ఉదయం 84,620.40 పాయింట్ల (క్రితం ముగింపు 85,063.34) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరకి 102.20 పాయింట్ల నష్టంతో 84,961.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 37.95 పాయింట్ల నష్టంతో 26,140.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.87గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.38 డాలర్లు, బంగారం ఔన్సు 4,464.01 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.


## అదానీ బాండ్లకు యమక్రేజ్..




**జారీ చేసిన 45 నిమిషాల్లోనే రూ1,000 కోట్ల బాండ్ల అమ్మకం**

**న్యూఢిల్లీ:** అదానీ బాండ్లకు యమక్రేజీ నెలకొన్నది. అదానీ గ్రూపునకు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) జారీ చేసిన రూ.1,000 కోట్ల నాన్‌కన్వర్టబుల్ డిబెంచర్ల(ఎన్‌సీడీ) ప్రారంభించిన కేవలం 45 నిమిషాల్లోనే అమ్ముడయ్యాయి. ఈ విషయాన్ని కంపెనీ స్టాక్ ఎక్స్చేంజ్‌లకు సమాచారం అందించింది. దీంట్లో రూ.500 కోట్ల ఎన్‌సీడీలు కేవలం పది నిమిషాల్లో అమ్ముడు పోగా..మిగతా రూ.500 కోట్ల బాండ్లు మరో అరగంటలో విక్రయించింది. ఈ బాండ్ల జారీ మంగళవారం ప్రారంభం కాగా, ఈ నెల 19న ముగియనున్నాయి. కానీ, ప్రారంభించిన రోజే పూర్తిగా అమ్ముడు పోవడం ఇదే మొదటిసారి కావడం విశేషం. మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత అనే ప్రాతిపదికన కేటాయింపు జరుగుతుందని తెలిపింది. ఈ బాండ్లపై 8.90 శాతం వరకు వార్షిక వడ్డీని ఆఫర్ చేస్తున్నది. ఈ ఎన్‌సీడీలను బీఎస్‌ఈ, ఎన్ఎస్‌ఈలో లిస్టింగ్ చేయనున్నది సంస్థ. ఈ బాండ్లపై ఇక్రా, కేర్ రేటింగ్ ఏజెన్సీలు 'ఏఏ' రేటింగ్ ఇచ్చాయి. 24 నెలలు, 36 నెలలు, 60 నెలల కాలపరిమితితో జారీ చేసిన ఎన్‌సీడీలపై వడ్డీని త్రైమాసికం, ఏడాదికొకసారి చెల్లింపులు జరపనున్నది. జూలై 2025లో సంస్థ రూ.1,000 కోట్ల ఎన్‌సీడీలను జారీ చేసి సేకరించింది.

## బ్యాంక్ డివిడెండ్లకు ఆర్బీఐ పరిమితి!




**ముంబై :** భాగస్వాములకు బ్యాంకులు డివిడెండ్లుగా ఇచ్చే చెల్లింపులు.. ఆ బ్యాంక్ నికర లాభంలో 75 శాతాన్ని మించరాదంటూ రిజర్వ్ బ్యాంక్ ప్రతిపాదిత నిబంధనల్ని విడుదల చేసింది. ఈక్విటీ షేర్లపై చెల్లించే మొత్తాన్నే 'డివిడెండ్'గా నిర్వచించిన ఆర్బీఐ.. అందులో మధ్యంతర డివిడెండ్ కూడా కలిసే ఉంటుందని స్పష్టం చేసింది. అయితే పర్పెచ్చువల్ నాన్‌క్యుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్స్‌పై డివిడెండ్ వేరే అని పేర్కొన్నది. ఈ మేరకు ఆర్బీఐ డైరెక్షన్స్ 2026 డ్రాఫ్ట్‌ను జారీ చేసింది. అర్హత కలిగిన గరిష్ఠ డివిడెండ్ చెల్లింపు కోసమే ఈ కొత్త పద్ధతిని ఆర్బీఐ ప్రతిపాదించింది. కాగా, దీని ప్రకారం డివిడెండ్ల ప్రకటన కోసం ప్రతిపాదనను పరిశీలించేటప్పుడు బ్యాంకుల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు.. సంస్థ దీర్ఘకాలిక వృద్ధి ప్రణాళికలు, మూలధన నిల్వలను తప్పక దృష్టిలో ఉంచుకోవాలి.

# ఉక్కు ధరల పెంపులో నిబంధనల ఉల్లంఘన

**28 కంపెనీల్లో సెయిల్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్**
**56 మంది ఎగ్జిక్యూటివ్‌లు సైతం**



ఉక్కు ధరల పెంపు విషయంలో 28 ఉక్కు కంపెనీలు, 56 మంది ఎగ్జిక్యూటివ్‌లు కుమ్మక్కయ్యారని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గుర్తించింది. 201523 మధ్య వీరు ఆ పనిచేశారని, అందుకు వాట్సప్ చాట్స్ వంటి ఆధారాలూ లభించాయని ఒక కాన్ఫిడెన్షియల్ ఆర్డర్‌లో సీసీఐ పేర్కొందని సమాచారం. ఇది నిర్ధారణ అయితే, ఆయా కంపెనీలు, వ్యక్తులు భారీ అపరాధ రుసుములను ఎదుర్కోవాల్సి రావొచ్చు.

దేశీయ ఉక్కు మార్కెట్‌పై ఆధిపత్యం చెలాయిస్తున్న టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సెయిల్‌తో పాటు 25 ఇతర కంపెనీలూ యాంటీ ట్రస్ట్ చట్టాలను ఉల్లంఘించినట్లు సీసీఐ ఆర్డర్‌లోని పత్రాలు పేర్కొన్నాయి. జేఎస్‌డబ్ల్యూ ఎండీ సజ్జన్ జిందాల్, టాటా స్టీల్ సీఈఓ టీవీ నరేంద్రన్, సెయిల్‌కు చెందిన నలుగురు మాజీ ఛైర్మన్లకూ ఇందులో పాత్ర ఉందని అక్టోబరు 6 నాటి సీసీఐ ఆదేశాలు చెబుతున్నాయని వార్తా సంస్థ 'రాయిటర్స్' తన కథనంలో పేర్కొంది. అయితే కంపెనీలు కానీ, సీసీఐ కానీ ఈ విషయమై ఇంకా స్పందించలేదు.

**దర్యాప్తు ఇలా:** దేశంలోని తొమ్మిది కంపెనీలు కలిసి ఉక్కు సరఫరాను నియంత్రిస్తూ, ధరలు పెంచుతున్నాయంటూ కొంత మంది బిల్డర్లు 2021లో ఒక క్రిమినల్ కేసు వేశారు. దీంతో 2022లో కొన్ని చిన్న కంపెనీలపై సీసీఐ దాడులు చేసి, దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాతి కాలంలో 31 కంపెనీలు, కొద్ది మంది ఎగ్జిక్యూటివ్‌లపైనా దర్యాప్తు చేసింది. సీసీఐ నిబంధనల కింద కుమ్మక్కు అయ్యే కార్యకలాపాల గురించి ఏ విషయమూ తేలకుండా, ప్రజలకు వెల్లడించరాదన్నది నిబంధన.

**ఇవి కూడా:** సీసీఐ దర్యాప్తు చేపట్టిన కంపెనీల్లో శ్యామ్‌స్టీల్ ఇండస్ట్రీస్, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ (విశాఖ ఉక్కు), ఇతర చిన్న కంపెనీలూ ఉన్నాయి. శ్యామ్, రాష్ట్రీయ ఇస్పాత్ సైతం స్పందించలేదని రాయిటర్స్ తెలిపింది.

**పెనాల్టీ తప్పదు:** ఇప్పటికే సీసీఐ ఆయా కంపెనీలను 2023కు ముందు 8 ఆర్థిక సంవత్సరాల, ఆర్థిక ఫలితాలను సమర్పించాలని తెలిపింది. సాధారణంగా అపరాధ రుసుములను వాటి ఆధారంగానే లెక్కవేస్తుంటాయి.



# వాలంటైన్స్ డే రోజు కపుల్ ఫ్రెండ్లీ మూవీ రిలీజ్

టాలీవుడ్ యాక్టర్ సంతోష్ శోభన్ హీరో గా నటిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ మూవీని వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. సన్‌లైట్‌లో హీరోహీరోయిన్లు రొమాంటిక్ మూడ్‌లో ఉన్న లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి అజయ్ కుమార్ రాజు పీ కో`ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన టీజర్ మిడిల్ క్లాస్ కష్టాల నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. టీజర్‌లో నెల్లూరు కుర్రాడైన శివ (సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేస్తూ, సరైన ఉద్యోగం లేక చెన్నైలో కష్టాలు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్(రాపిడో లాంటివి) చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ప్రీతి (మానస వారణాసి) అతని బైక్‌లో ప్రయాణిస్తుంది. అలా అనుకోకుండా కలిసిన ఈ ఇద్దరూ ఆ తర్వాత ఎలా ప్రేమలో పడతారు.. అనే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది.

# ఆ రెండు చిత్రాలకు హైకోర్టులో ఊరట



'ది రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల విషయంలో గతంలో సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు 'పుష్ప2', 'ఓజీ', 'గేమ్ ఛేంజర్', 'అఖండ 2' చిత్రాలకే పరిమితం చేసింది. దీంతో తాజా చిత్రాల నిర్మాతలకు ఊరట లభించినట్లయ్యింది. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. దీనిపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన తీర్పును ఆ చిత్రాల వరకే పరిమితం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ రెండు చిత్రాలకు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం లభించింది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'ది రాజాసాబ్' జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదల కానుంది.

## దృశ్యం 3 ఏప్రిల్‌లో విడుదల

మలయాళం నుంచి క్రైం థ్రిల్లర్ జోనర్‌లో వచ్చి దక్షిణాది భాషల్లో సూపర్ క్రేజ్ సంపాదించిన ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ దృశ్యం. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడీ ఫ్రాంచైజీలో అందరినీ మెస్మరైజ్ చేసేందుకు మరోసారి దృశ్యం 3 కూడా వస్తోంది. మోహన్ లాల్ , మీనా కాంబోలో వస్తోన్న దృశ్యం3 గత సెప్టెంబర్‌లో గ్రాండ్‌గా లాంచ్ అయింది. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. ఇక ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రకటన రానే వచ్చింది. దృశ్యం ఎంతోమందిని ప్రభావితం చేస్తూ ఇప్పటికీ క్యూరియాసిటీతో ఎదురుచూసేలా చేస్తున్న సినిమా అని అన్నాడు డైరెక్టర్ జీతూ జోసెఫ్. ఎలాంటి భారీ అంచనాలు పెట్టుకోకుండా చూసే ఫ్రాంచైజీ ఇదని.. దృశ్యం 3ఏప్రిల్ తొలివారంలో మీ ముందుకు వస్తోందని ప్రకటించాడు. మొత్తానికి మూవీ లవర్స్ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న దృశ్యం థర్డ్ పార్టు రిలీజ్‌కు సంబంధించి డైరెక్టర్ జీతూ జోసెఫ్ క్రేజీ వార్తను షేర్ చేసి మూవీ లవర్స్‌తోపాటు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. జార్జ్‌కుట్టీ ప్రపంచంలోకి మరోసారి తీసుకొస్తూ.. అంటూ మోహన్ లాల్ చాలా రోజుల క్రితం షేర్ చేసిన ఫొటో ఒకటి ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతోంది. దశ్యం ఫ్రాంచైజీలో వచ్చిన రెండు పార్టులు ఇప్పటికే బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. రెండు పార్టులను తెరకెక్కించిన ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని కూడా తెరకెక్కిస్తోంది.



# మా ఇంటి బంగారంతో సమంత పలకరింపు

సమంత అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దర్శకురాలు మినహా ఇప్పటివరకూ ఎవరూ ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను సామ్ షేర్ చేశారు. ఈ సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్న సమంత .. ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. 'మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది అంటూ రాశారు. జనవరి 9న ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడిరచారు. దీంతో అభిమానులు సంబర పడుతున్నారు. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అని కామెంట్స్ చేస్తున్నారు. 'ఓ బేబీ' తర్వాత సమంత దర్శకురాలు నందిని రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. గతేడాది అక్టోబర్ 2న దీని షూటింగ్‌ను ప్రారంభించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు. దీనితో పాటు సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.



# ఆగని దురంధర్ దూకుడు

ధురంధర్ సినిమా బాక్సాఫీసు వద్ద దూసుకెళ్తున్నది. ఆ ఫిల్మ్ కలెక్షన్ల జోరు తగ్గడం లేదు. తాజాగా ఆ ఫిల్మ్ ఓ కొత్త రికార్డు క్రియేట్ చేసింది. అత్యధిక వసూళ్లు చేసిన హిందీ భాష చిత్రంగా ధురంధర్ ఘనత సాధించింది. ఇప్పటి వరకు హిందీ భాషలో ధురంధర్ సినిమా రూ.1240 కోట్లు ఆర్జించినట్లు ఫిల్మ్ మేకర్స్ పేర్కొన్నారు. ఆదిత్య ధార్ డైరక్షన్‌లో వచ్చిన ధురంధర్ సినిమా ప్రస్తుతం సంచలనాలు నమోదు చేస్తున్నది. జియో స్టూడియోస్ ప్రకారం ఆ ఫిల్మ్ కేవలం హిందీ భాషలోనే ఇప్పటి వరకు 1240 కోట్లు ఆర్జించింది. భారత్‌లో ఇప్పటి వరకు 968 కోట్లు ఆర్జించింది. ఇక విదేశాల్లో ఆ సినిమాకు 272 కోట్లు వచ్చాయి. దురంధర్ 2 చిత్రాన్ని మాత్రం హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఆ ఫిల్మ్ ఈ ఏడాది మార్చి 19న రిలీజ్ కానున్నది. అయితే తొలి పార్ట్‌కు విపరీతమైన డిమాండ్ ఉన్న కారణంగా.. ఆ ఫిల్మ్ సీక్వెల్‌ను పలు ఇతర భారతీయ భాషల్లో రిలీజ్ చేసే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు. రిలీజైన తర్వాత ధురంధర్ చిత్రం హిందీ భాషలో పలు రికార్డులు నెలకొల్పింది. కేవలం 16 రోజుల్లోనే ఇండియాలో 500 కోట్లు వసూల్ చేసింది. ఇది బాలీవుడ్‌లో రికార్డు. ఇక ఆ తర్వాత అదే వేగంతో 600, 800, వెయ్యి కోట్ల క్లబ్‌కు చేరుకున్నది.

## భర్తలకు రవితేజ విజ్ఞప్తి.. నవ్వులు పంచుతున్న కొత్త ట్రైలర్..

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ ఈ సంక్రాంతికి సందడి చేయడానికి రవితేజ సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథానాయికలు. జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇద్దరి భామల మధ్య నలిగిపోతోన్న వ్యక్తిగా రవితేజ తన మార్క్ కామెడీతో అలరిస్తున్నారు

